ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
సోమవారం 7 ఏప్రిల్ 2025


కృష్ణానదిలో ఇసుక లోడింగ్

ఇసుకకు ప్రీమాన్‌సూన్ ప్లాన్

- 14 లక్షల ఎంటీల నిల్వకు ప్రణాళిక
- నియోజకవర్గానికి 2 లక్షల టన్నులు కేటాయింపు
- తొలుత 7 లక్షల టన్నులు తవ్వి నిల్వ చేసేందుకు నిర్ణయం

గుంటూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో కృష్ణానదికి వరదలతో ఇసుక తవ్వకాలకు ఆటంకాలు తలెత్తుతున్న నేపథ్యంలో ఈ ఏడాది మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్‌ని అధికారులు రూపొందించారు. వరద ఎక్కువగా ఉండే జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ఇసుక లభ్యం కాక ఏ ఒక్క నిర్మాణం నిలిచిపోకూడదన్న లక్ష్యంగా అధికారులు ఇప్పటి నుంచే చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం నదిలో ఎలాంటి వరద లేనందున భారీగా ఇసుక తవ్వకాలు జరిపి ప్రభుత్వ స్థలాల్లో నిల్వ చేయాలని జిల్లా స్థాయి ఇసుక కమిటీ ఇటీవలే నిర్ణయించింది. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి కనీసం 2 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు కలిపి 14 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు అవసరం అవుతాయి. అయితే ఏప్రిల్ నెలాఖరు కల్లా కనీసం ఒక్కో నియోజకవర్గంలో లక్ష మెట్రిక్ టన్నుల ఇసుకని నిల్వ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందుకోసం గుండిమెడ-2 ఓపెన్ రీచ్‌లో 51,758 ఎంటీల ఇసుక నిల్వలను గుర్తించారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి నుంచి పర్యావరణ అనుమతులు, సీఎఫ్‌వో, సీఎఫ్ఈలను తీసుకోవాల్సి ఉన్నది. బొమ్మువానిపాలెం పీఎల్-1లో 72,790 ఎంటీలకి అనుమతులు తీసుకోవాలి. బొమ్మువానిపాలెం-16 ఓపెన్ రీచ్‌లో 2,50,000 ఎంటీలు, బొమ్మువానిపాలెం-17 ఓపెన్ రీచ్‌లో 1,00,000 ఎంటీల నిల్వలు ఉండగా తహసీల్దార్ ఎన్‌వోసీ ఇవ్వలేదు. నేవిగేషన్ ఛానల్ డ్రెడ్జింగ్ చేస్తే అక్కడ 5,16,000 ఎంటీల ఇసుక లభ్యం అవుతుంది. ఇక రాయపూడిలో పూడిక తొలగింపు పాయింట్‌లో 1,19,430, బోరుపాలెంలో 2,30,670, బొమ్మువానిపాలెం-14లో బ్యాలెన్స్ స్టాకు 34,254, బొమ్మువానిపాలెం-14లో ఎక్స్‌కవేషన్ ద్వారా 13,582, బొమ్మువానిపాలెం-15లో పెండింగ్ 3,943, బొమ్మువానిపాలెం-15లో ఎక్స్‌కవేషన్ ద్వారా 51,672 మెట్రిక్‌టన్నుల ఇసుక నిల్వలున్నట్లు మైనింగ్ అధికారులు నివేదించారు. ఈ ప్రకారం జిల్లాలో 14 లక్షల 49 వేల 499 ఎంటీల ఇసుక నిల్వలున్నాయి. వీటిని ఏప్రిల్, మే నెలల్లో తవ్వకాలు జరిపి ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేసే డిపోలకు తరలిస్తే రాబోయే వర్షాకాలంలో ఇసుకకు ఎలాంటి ఇబ్బంది ఉండదని అధికారులు భావిస్తున్నారు.


గుంటూరులో శోభాయాత్ర


గుంటూరు: కొరిటపాడులోని శ్రీ కోదండ రామాలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

జయజయరామ.. జగదభిరామ

- వాడవాడలా నవమి వేడుకలు
- నేత్ర పర్వంగా సీతారాముల కల్యాణోత్సవాలు
- భక్తులతో కిక్కిరిసిన రామ, ఆంజనేయుని ఆలయాలు

గుంటూరు(తూర్పు), తెనాలి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జై శ్రీరాం.. జయజయరామ.. జగదభిరామ.. నామస్మరణలతో పల్లెలు, పట్టణాలు మారుమోగగా.. సీతారామ కల్యాణ వైభోగమే వైభోగం.. అంటూ సీతారామ కల్యాణోత్సవాలను తిలకించిన భక్తులు తరించిపోయారు. చూసిన కనులదే భాగ్యం అన్నట్లుగా రాములోరి కల్యాణోత్సవాలు నేత్రపర్వంగా జరిగాయి. శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం వాడవాడలా నవమి వేడుకలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. సీతారాముల కల్యాణోత్సవాలతో ఊరూవాడ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా శ్రీరామ నామస్మరణలతో తరించారు. వాడవాడలా నవమి వేడుకలు వైభవంగా జరిగాయి. రామాలయాలు, శ్రీఆంజనేయస్వామి ఆలయాలతో పాటు కూడళ్లలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో సీతారాముల కల్యాణోత్సవాలు నేత్రపర్వంగా జరిగాయి. ఆలయాల్లో వేకువజాము నుంచే స్వామి మూలవిరాట్‌కు అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పానకం, వడపప్పు ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదాల వితరణలు పెద్దఎత్తున జరిగాయి. గుంటూరులో పలు వాడల్లో, తెనాలిలోని హనుమాన్‌చౌక్, మార్కెట్ సెంటర్‌లోని దొంగరాముని ఆలయం, మారీసుపేట అప్పల స్వామి ఆలయంలో జరిగిన శ్రీసీతారాముల కల్యాణానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. మెయిన్‌రోడ్డులో పలు చోట్ల వేదికలు ఏర్పాటు చేసి సీతారాముల కల్యాణాన్ని వ్యాపారులు జరిపించారు.


తెనాలిలో దొంగరాముని ఆలయం ఎదుట కళ్యాణ మంగళ సూత్రాలను ప్రదర్శిస్తున్న అర్చకులు


కల్యాణం తిలకిస్తున్న భక్తులు

శోభాయమానంగా.. శోభాయాత్ర

నవమి సందర్భంగా గుంటూరులో ఆదివారం శ్రీరామ శోభా యాత్ర అత్యద్భుతంగా జరిగింది. నగర వీధులు కాషాయ వర్ణంతో శోభిల్లాయి. గార్డెన్స్ నుంచి శోభాయాత్ర ప్రారంభమవగా రథంపై నిలువెత్తు నీల మేఘశ్యాముడు భక్తులకు దర్శనమిచ్చాడు. శోభాయాత్ర రథాన్ని, శ్రీరాముడు విగ్రహాన్ని డాక్టర్ రాఘరామిరెడ్డి, డాక్టర్ ఝాన్సీలక్ష్మీదేవి ఆవిష్కరించగా, తాళ్లాయపాలెం శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి, గన్నవరం, భువనేశ్వరీ పీఠాధిపతి కమలానంద భారతి స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గజల్ శ్రీనివాస్, భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ, డాక్టర్ వెంకటేశ్వరరావు, తులసి ధర్మచరణ్ తదితరులు యాత్రను ప్రారంభించారు. యాత్రలో పాల్గొన్న భక్తులకు చందనబ్రదర్స్ సెంటర్లో తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహమద్ మజ్జిగ, వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేసి, హిమని సెంటర్ వరకు యాత్రలో పాల్గొన్నారు. యాత్ర సందర్భంగా బందోబస్తు, ట్రాఫిక్ నిర్వహణ ఏర్పాట్లను ఎస్పీ సతీష్‌కుమార్ పర్యవేక్షించారు. ఆర్ అగ్రహారం శ్రీరామనామ క్షేత్రం వద్ద యాత్ర ముగింపులో భారీ అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వల్లూరు జయప్రకాష్‌నారాయణ, చెరుకూరి తిరుపతిరావు, డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, జూపూడి రంగరాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు, శివశక్తి స్టేట్ కో కన్వీనర్ లక్ష్మీరామానుజుదాసి, జిల్లా అధ్యక్షుడు హర్షవర్ధన్‌శాస్త్రితో పాటు రఘురాంరెడ్డి, డాక్టర్ శ్రీకాంత్, భారతీయ విద్యాభవన్స్ కార్యదర్శి రామచంద్ర రాజు, హిందూ చైతన్య వేదిక ఉపాధ్యక్షుడు వంగా నవీన్‌రెడ్డి, భాష్యం హనుమంతురావు, కమిటీ నిర్వాహకులు కారంశెట్టి లోకేశ్, బ్రహ్మారెడ్డి, అడపా ఫణీంద్ర, వేణుగోపాలరెడ్డి, రాజేష్, గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, కమిటీ సభ్యులు ఊటుకూరి నాగేశ్వరరావు, బొర్రా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.


కృష్ణా కరకట్ట రోడ్డు

కుడి కరకట్టకు మోక్షం

ఎట్టకేలకు పదేళ్ల నిరీక్షణకు తెర

- సీతానగరం నుంచి ఎగువన నాలుగులేన్లు
- రూ.1100 కోట్లతో 7.2 కిమీ పొడవునా విస్తరణ
- నదికి లోపలి వైపున రిటైనింగ్ వాల్ నిర్మాణం కూడా

భూసేకరణ సమస్యతో పదేళ్లుగా నిలిచిన కృష్ణా ఎగువ కుడి కరకట్ట రోడ్డు విస్తరణకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. రాజధాని ప్రాంతంలో రద్దీ ఉన్న కరకట్ట రోడ్డుపై ప్రయాణమంటే హడలే. అయినా తప్పనిసరి పరిస్థితుల్లో సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు భయంభయంగానే ప్రయాణిస్తూ వచ్చారు. ఇక వీరందరి భయాలకు చెక్ పెడుతూ ప్రభుత్వం కరకట్ట విస్తరణకు సిద్ధమైంది. రూ.1100 కోట్ల వ్యయంతో తొలి 7.2 కిలోమీటర్ల పొడవునా కరకట్టను నాలుగు లేన్ల రహదారిగా విస్తరించనున్నారు. దీనికి సంబంధించి మరో వారం రోజుల్లో టెండర్లను పిలిచేందుకు సీఆర్‌డీఏ సన్నద్ధమైంది.

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

అమరావతిలో రోడ్ గ్రిడ్ పనులకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం పనిలో పనిగా కృష్ణా కరకట్ట రోడ్డు విస్తరణ కూడా చేపట్టనున్నది. సీతానగరం ఎత్తిపోతల నుంచి ఎగువకు 7.2 కిలోమీటర్ల మేర కరకట్టను నాలుగులేన్ల రహదారిగా విస్తరణకు ఏపీసీఆర్‌డీఏ సుమారు రూ.1100 కోట్లు కేటాయించింది. ఈ మేరకు వారం రోజుల్లో టెండర్లను పిలిచే దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీంతోపాటు కృష్ణానదికి ఎగువన రెండు వైపులా రిటైనింగ్ వాల్స్‌ను కూడా ఏర్పాటు చేస్తే వరదల నుంచి ఇటు రాజధాని అమరావతికి, అటు విజయవాడ నగరానికి రక్షణ కలుగుతుందని అధికారులు భావిస్తున్నారు. రాజధానిగా అమరావతిని నిర్ణయించడంతో ప్రకాశం బ్యారేజి ఎగువన కుడి కరకట్టకు విపరీతమైన ప్రాధాన్యం ఏర్పడింది. దీనికితోడు చంద్రబాబు తన నివాసాన్ని ఉండవల్లిలోని కరకట్ట వెంబడి ఏర్పాటుచేసువడంతో ఆ మార్గంలో వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. కరకట్ట రోడ్డు కింది వైపు 21 మీటర్ల వెడల్పు ఉన్నా పైన కేవలం ఏడు మీటర్లకు మాత్రమే పరిమితమైంది. 4.5 మీటర్ల ఎత్తులో కట్ట ఉండటంతో ఎదురెదురు వాహనాలు వస్తే ఇబ్బందికర పరిస్థితి. ఈ క్రమంలో పదేళ్లుగా ప్రభుత్వం కరకట్ట విస్తరణ జోలికి పోకపోవడంతో వాహనదారులు నరకయాతన అనుభవించారు. వాస్తవానికి కరకట్ట ప్రకాశం బ్యారేజి నుంచి ఎగువకు వైకుంఠపురం కొండ వరకు 22 కిలోమీటర్ల పొడవున ఉంది. అయితే ప్రస్తుతానికి కరకట్టను 7.2 కిలోమీటర్ల వరకు తొలిదశ కింద విస్తరిస్తారు. దీంతోపాటు కొండవీటివాగు హెడ్ రెగ్యులేటర్‌పై ఇరుకైన వంతెనను కూడా కొత్తగా నిర్మించనున్నారు.

భూములు ఇచ్చేందుకు రైతులు సిద్ధం

కరకట్ట కింది వైపు 21 మీటర్లు ఉండగా పై వైపు ఏడు మీటర్ల వరకే ఉంది. దీనిని సెంట్రల్ వెర్జ్‌తో నాలుగులేన్ల రహదారిగా విస్తరించాలంటే పై అంచులో 24 మీటర్లకు పైగా ఉండాలి. అంటే కరకట్ట విస్తరణకు భూసేకరణ చేయాలి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల డిమాండ్ మేరకు కరకట్టను రూ.150 కోట్లతో విస్తరించాలని ప్రయత్నించినా రైతులు భూములను ఇచ్చేందుకు అంగీకరించకపోవడంతో సాధ్యపడలేదు. కట్టకు లోపలి వైపు నుంచి విస్తరణకు జలవనరుల శాఖ అభ్యంతరం చెప్తుంది. దీంతో తప్పనిసరిగా వెలుపలి పక్కే భూసేకరణ చేసి విస్తరించాల్సి వస్తుంది. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం పెనుమాక, ఉండవల్లి రైతులు భూసేకరణకు సంసిద్ధతను వ్యక్తం చేస్తుండడంతో ప్రభుత్వం కరకట్ట విస్తరణ వైపు అడుగులు వేస్తుందని భావించవచ్చు. ఈ సందర్భంలో ఎత్తును 4.5 మీటర్ల నుంచి ఎనిమిది మీటర్లకు పెంచడం ద్వారా కరకట్టను బలిష్టం చేసినట్లవుతుందని అంచనా వేస్తున్నారు. కరకట్టకు లోపలిపక్క కాంక్రీట్ రిటైనింగ్‌వాల్‌తో భవిష్యత్తులో 15లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా ఎలాంటి ఇబ్బంది ఉండదని సీఆర్‌డీఏ అధికారులు భావిస్తున్నారు.



డీఆర్ఎంగా.. సుధేష్ణసేన్

- నేడు బాధ్యతల స్వీకారం
- డివిజన్ చరిత్రలో రెండో మహిళా ఉన్నతాధికారి

గుంటూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ నూతన మేనేజర్‌గా సుధేష్ణసేన్ సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. న్యూఢిల్లీలో రిలీవింగ్ అయిన ఆమె ఇప్పటికే విజయవాడ చేరుకున్నారు. పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌కు వచ్చి సోమవారం చార్జి తీసుకుంటానని ఆదివారం డివిజనల్ అధికారులకు ఆమె సమాచారం ఇచ్చారు. దాంతో బదిలీ అయిన డీఆర్ఎం రామకృష్ణ రిలీవింగ్, ఆ స్థానంలో సుధేష్ణసేన్ బాధ్యతల స్వీకారం సోమవారం వరసగా జరగనున్నాయి. ఇందుకోసం డివిజనల్ అధికారులు ఏర్పాట్లు చేశాయి. మధ్యాహ్నం జరగనున్న రైల్వే జీఎం వీడియో కాన్ఫరెన్స్‌కి డీఆర్ఎంగా సుధేష్ణసేన్ హాజరౌతారని సమాచారం. గుంటూరు రైల్వే డివిజన్ ఏర్పడిన తర్వాత డీఆర్ఎంగా సుధేష్ణ సేన్ బాధ్యతలు చేపట్టిన రెండో మహిళ అవుతారు. ఇంతకుముందు వీజీ భూమ తొలి మహిళ డీఆర్ఎంగా ఇక్కడ విధులు నిర్వహించారు.

శంకుస్థాపనకు సిద్ధమవుతున్న చంద్రబాబు నివాసం

మంగళగిరి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో సీఎం చంద్రబాబు సొంతిల్లు ఏర్పాటుచేసుకుంటున్నారు. దీనికి సంబంధించి వెలగపూడి పరిధిలో ఎన్-11, ఈ-6 రోడ్డు జంక్షన్‌లో ఐదెకరాల స్థలంలో ఈ నెల 9న ఇంటి నిర్మాణ పనులకు భూమిపూజ చేయనున్నారు. దీనికి సంబంధించి ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. వారం రోజులుగా సదరు స్థలంలో ఎక్స్‌కవేటర్ల సాయంతో జంగిల్



చంద్రబాబు ఇంటి నిర్మాణంలో భాగంగా బోర్‌వెల్‌ను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

క్లియరెన్స్ పనులను చేపట్టి పూర్తిచేశారు. భూమి చదును పనులను కూడా జరిపించారు. ఆదివారం ఆ స్థలంలో బోరు వేయించే కార్యక్రమాన్ని ఆరంభించారు. మొత్తం 25 వేల చదరపు గజాల విస్తీర్ణం కలిగిన స్థలంలో నివాసం, క్యాంప్ కార్యాలయంతో పాటు వర్కర్స్ నివాసాలు, గార్డెన్ వంటి సౌకర్యాలను కల్పిస్తారని తెలిసింది. ఈ స్థలం మీదగా వెళ్తున్న హెచ్‌టీ లైన్లను మార్చే పనులను చేపట్టాల్సి ఉంది. భూమిపూజ కార్యక్రమం పూర్తయిన వెంటనే పనులను వేగంగా చేపట్టేందుకు అవసరమైన నిర్మాణ సామగ్రి, భారీయంత్రాలను సైతం ఇప్పటికే ఆ పరిసర ప్రాంతాలకు తరలించారు. వర్కర్లకు, ఇంజనీరింగ్ అధికారుల కోసం షెడ్లను సిద్ధం చేశారు. నిర్మాణ పనుల కాంట్రాక్టును ఎస్ఎస్ఆర్ సంస్థకు అప్పగించినట్లు తెలిసింది.

విద్యుదాఘాతంతో రైతు మృతి



కృష్ణారెడ్డి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ తిరుపతిరావు

రేపల్లె,కర్లపాలెం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. కర్లపాలెం మండలం పెద్దపులుగువారి పాలెంకు చెందిన అక్కల కృష్ణారెడ్డి (47) నిజాంపట్నం మండలం పరిధిలో పామర్రు గ్రామంలో రొయ్యల చెరువు సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రొయ్యల చెరువు లోని ఫ్యాన్ పనిచేయకపోవడంతో బాగు చేసే నిమిత్తం ఫ్యాన్ దగ్గరకు వెళ్లాడు. దీంతో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కృష్ణారెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటన స్థలానికి నిజాంపట్నం ఎస్ఐ కందుల తిరుపతిరావు చేరుకుని మృతదేహంను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అజరామరమైనది రంగస్థలం

● సినీ నటుడు అజయ్ ఘోష్

● మూడోరోజు కొనసాగిన పుచ్చలపల్లి సుందరయ్య నాటికల పోటీలు



నాటిక పోటీలను తిలకించేందుకు వచ్చిన ప్రేక్షకులతో కిక్కిరిసిన కళా ప్రాంగణం

యడ్లపాడు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : వెబ్ సిరీస్‌లు, టీవీ సీరియల్స్, సినిమాలు, సాంకేతిక విప్లవం ఎన్ని వచ్చినా రంగస్థలానికి సాటి రావని, అది అజరామరమైనది, మరణంలేనిదని సినీ నటుడు అజయ్ ఘోష్ అన్నారు. యడ్లపాడు పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఆహ్వాన నాటికల పోటీలు మూడో రోజైన ఆదివారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా అజయ్ ఘోష్ మాట్లాడుతూ సమాజంలో మార్పును తెచ్చేందుకు కళాకారులను, రచయితలను, కళాభిమానులను ప్రోత్సహిస్తూ నాటిక పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రంగస్థలం ద్వారా వచ్చిన నటీనటులు దీర్ఘకాలం పరిశ్రమలో మనగలుగుతారన్నారు. అనంతరం మూడు నాటికలు ప్రదర్శితమయ్యాయి. పోటీలను తిలకించేందుకు వచ్చిన ప్రేక్షకులతో కళా ప్రాంగణం కిక్కిరిసి పోయింది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, కళానిలయం అధ్యక్షులు ముత్తవరపు సురేష్‌బాబు, ప్రధానకార్యదర్శి ముత్తవరపు రామారావు, ఉపాధ్యక్షులు జరుగుల శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్న సమస్యలకే స్థైర్యం కోల్పోయిన కూతురు 'నాన్నా నేనొచ్చేస్తా' పుట్టింటికి..

తల్లిదండ్రులు తమ పిల్లలకు సమాజంపై అవగాహన కల్పించకుండా అపారమైన ప్రేమానురాగాలతో పెంచితే అది వారి భవిష్యత్‌పై ఎలాంటి దుష్ప్రభావాన్ని చూపుతుందో తెలియచేసే కళారూపమే 'నాన్నా నేనొచ్చేస్తా' నాటిక. పెళ్ళికి ముందు ఆడ పిల్లలకు అపరిమితమైన స్వేచ్ఛను ఇవ్వడంతోపాటు వారు కోరినవన్నీ ఇచ్చి కష్టం తెలియకుండా పెంచుతారు. వివాహానంతరం కాపురంలో వచ్చే చిన్న చిన్న మనస్పర్ధలను తట్టుకోలేక మానసిక స్థైర్యం కోల్పోయి 'నాన్నా నేను వచ్చేస్తున్నా' అంటూ పుట్టింటి బాట పడుతూ తమ జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారంటూ హెచ్చరిస్తూ సందేశాత్మకంగా సాగిన నాటిక ఇది. అమృతలహరి థియేటర్స్ గుంటూరు వారు ప్రదర్శించిన ఈ నాటికను తాళాబత్తుల వెంకటేశ్వరరావు రచించగా, అమృత, లహరిలు దర్శకత్వం వహించారు.



బ్రహ్మస్వరూపం నాటికలోని సన్నివేశం

ప్రతికూల శక్తుల నుంచి ధర్మాన్ని కాపాడేదే 'బ్రహ్మ స్వరూపం'

ప్రశాంతమైన జీవితంలోకి ఊహించని కష్టాలు ప్రవేశించి ప్రతికూల శక్తుల రూపంలో విఘాతం కలిగిస్తాయి. ఆ సమయంలో మనం నిరాశ, నిస్పృహలతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతుండగా విధి భయంకరమైన పరీక్షగా మారుతుందని చాటిచెప్పే నాటిక 'బ్రహ్మ స్వరూపం' ఇతివృత్తం. విషమ పరిస్థితుల్లో ధర్మాన్ని నిలబెట్టేందుకు బ్రహ్మ స్వరూపం ప్రత్యక్షమై తుది న్యాయాన్ని ప్రసాదిస్తాడు. స్వచ్ఛమైన దృష్టితో చూసినప్పుడు మనసుకు నచ్చిన జీవితం మన ముందు సాక్షాత్కరిస్తుందని తెలియచేసే నాటిక. మైత్రి కళానిలయం. విజయవాడవారు ప్రదర్శించిన ఈ నాటికను శ్రీస్నిగ్ధ రచించగా టీవీ పురుషోత్తం దర్శకత్వం వహించారు.

వరుసలతో పిలిస్తే బంధం బలపడుతుందని తెలిపే కథనమే 'బావా ఎప్పుడు వచ్చితీవు'

కుటుంబ వ్యవస్థలో అమ్మ, నాన్న, చెల్లి, అక్క బావ అనే పిలుపులతో బంధాలు, బాంధవ్యాలు బలపడతాయి. ప్రేమానురాగాలు వర్ధిల్లుతాయని సందేశాన్నిస్తూ సాగుతుంది యడ్లపాడు మానవత వారు ప్రదర్శించిన 'బావా ఎప్పుడు వచ్చితీవు' నాటిక. వరుసలు కలిపి పిలిచే అమాయకపు భార్య, అపోహ, అభద్రతా భావం కలిగిన భర్త మధ్య కొన్ని విచిత్ర సంఘటనలు చోటుచేసుకుంటాయి. ఆయా సంఘటనలన్నీ కడుపుబ్బ నవ్విస్తూనే ఎంతో సున్నితంగా కనువిప్పు కలిగిస్తుంది. ఆద్యంతం హాస్యరస భరిత సంఘటనల సమాహారమైన ఈ నాటికను స్వర్గీయ పీవీ భవాని ప్రసాద్ రచించగా, జరుగుల రామారావు దర్శకత్వం వహించారు.

తామర పూల కోసం వెళ్లి విద్యార్థి మృతి



తోట లక్ష్మణ్ (ఫైల్)

వినుకొండ టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): చెరువులో తామర పూలకోసమని వెళ్లి పదో తరగతి విద్యార్థి మృతిచెందిన సంఘటన మండలంలోని నడిగడ్డలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు... గ్రామంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో ఇటీవల పదో తరగతి పూర్తిచేసుకుని పండుగ సందర్భంగా తామర పూలు కోసేందుకు తోటి విద్యార్థులతో కలిసి చెరువులోకి దిగడంతో తోట లక్ష్మణ్ (15) నీటిలో మునిగాడు. కుటుంబసభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని వినుకొండలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని స్వగ్రామం తరలించారు. తోట కోటయ్య, మంగమ్మ లకు కుమారుడు, కుమార్తె కలరు. కుమారుడు లక్ష్మణ్ మృతితో కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సంఘటనపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు చేయలేదు.

రౌడీషీటర్ లడ్డుపై హత్యాయత్నం కేసు

◆ అరెస్టు.. 17 వరకు రిమాండ్

తెనాలి రూరల్,ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మహిళపై దాడిచేసి హత్యాయత్నానికి ప్రయత్నించిన రౌడీషీటర్ సముద్రాల పవన్ కుమార్ అలియాస్ లడ్డుపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోపల్లె గ్రామానికి చెందిన సంధ్యారాణి తెనాలి చెంచుపేటలో ఓ ప్రైవేట్ సంస్థలో టెలీకాలర్‌గా పనిచేస్తుంది. కొంత కాలం క్రితం పవన్ కుమార్‌తో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి ఫోన్‌లో మాట్లాడుకుంటున్నారు. ఇటీవల పవన్‌కుమార్ ఫోన్ చేసినా సంధ్యారాణి ఎత్తడం లేదు. శుక్రవారం విజయవాడలో నూతన బ్రాంచ్ ప్రారంభం ఉండటంతో సంధ్యారాణి అక్కడకు వెళ్లింది. ఇది తెలుసుకున్న పవన్‌కుమార్ (లడ్డు) విజయవాడ వెళ్లి ఆమెను ఫోన్ ఎత్తడం లేదంటూ అతడి కారు ఎక్కించుకుని తెనాలి మండలం అంగలకుదురు శివారు తోటల్లోకి తీసుకువెళ్లి విచక్షణారహితంగా దాడి చేశాడు. రక్తగాయాలతో ఉన్న ఆమె భర్త సాయంతో ఓ ప్రైవేట్ వైద్యశాలకు వెళ్లి చికిత్స అనంతరం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. అనంతరం అతనిని అదుపులోకి తీసుకుని జడ్జి ఎదుట ప్రవేశ పెట్టగా ఈ నెల 17 వరకు రిమాండ్ విధించినట్లు రూరల్ ఎస్ఐ ప్రతాప్‌కుమార్ తెలిపారు.

రోడ్డుప్రమాదంలో తల్లి, కుమారుడు మృతి

బాపట్ల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : బైపాస్‌రోడ్డులో బైక్‌పై వెళుతున్న వారిని ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మరణించగా చికిత్స పొందుతూ మహిళ మృతిచెందిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం ముత్తాయపాలెం గ్రామానికి చెందిన పేర్ల శివయ్య(45) టీటీడీ కల్యాణ మండపం దగ్గర కొబ్బరికాయల వ్యాపారం చేస్తుంటాడు. రాత్రి తన తల్లి చిట్టెమ్మ(75)ను బైక్ ఎక్కించుకుని జగనన్నకాలనీ మీదగా బైపాస్‌లో మచ్చావారిపాలెం అడ్డరోడ్డు దగ్గరకు వెళ్ళేసరికి ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో శివయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రగాయాలైన తల్లి చిట్టెమ్మ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సోషలిస్టు నేత పాపిరెడ్డి మృతి

● సంతాపం తెలిపిన పలువురు ప్రముఖులు



మోదుగుల పాపిరెడ్డి (ఫైల్)

గుంటూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సోషలిస్టు నాయకుడు, న్యాయవాది మోదుగుల పాపిరెడ్డి(88) మృతి చెందారు. ఆదివారం గుంటూరు నగరంలోని తన స్వగృహంలో ఆయన కన్నుమూశారు. పాపిరెడ్డి మాజీ ఎంపీ, ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాలరెడ్డి తండ్రి. పాపిరెడ్డి అంత్యక్రియలు సోమవారం నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. పాపిరెడ్డి ఎమర్జన్సీ సమయంలో జైలుకు కూడా వెళ్లారు. తుళ్లూరు మండలంలోని పెదపరిమి గ్రామానికి చెందిన పాపిరెడ్డి జాతీయ స్థాయిలో ప్రముఖ సోషలిస్టు నాయకులతో సన్నిహిత సంబంధాలు కలిగివుండేవారు. ఆ తర్వాత ఆయన గుంటూరు జిల్లా కోర్టులో న్యాయవాది వృత్తిని చేపట్టి సుదీర్ఘకాలం కొనసాగారు. పాపిరెడ్డి మృతిపై రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. ఎమర్జన్సీ సమయంలో తాను, పాపిరెడ్డి ఒకే జైలులో ఉన్నామని ఆనాటి చీకటి రోజులను గుర్తు చేసుకొన్నారు. పాపిరెడ్డి తన రాజకీయ జీవితంలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా చిరకాలం పోరాడారని చెప్పారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 30.23 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి ఎనిమిది వందల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద మూడు వందల క్యూసెక్కుల నీరు లీకుల ద్వారా దిగువ కృష్ణకు విడుదల అవుతున్నాయి.

దేవుని యందు నిరీక్షణ కలిగివుండాలి

బిషప్ భాగ్యయ్య

మంగళగిరి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషి దేవుని యందు నిరీక్షణ కలిగి జీవించాలని గుంటూరు బిషప్ రెవరెండ్ చిన్నాబత్తిని భాగయ్య వుద్బోదించారు. నిరీక్షణ కలిగివున్నవానికి జీవితంలో నిరాశే వుండదని ఆయన చెప్పారు. పెదవడ్లపూడిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పునీత మిఖాయిల్ చర్చిలో ప్రతి 25 ఏళ్లకు నిర్వహించే జూబ్లీ వేడుకలలో భాగంగా ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమంలో ఆయన పాల్గొని దేవుని వాక్యాన్ని వినిపించారు. దేవుని పట్ల భయభక్తులను కలిగివున్న వారికి దేవుడు అత్యున్నతంగా ఉదారంగా తనదైన దయను ప్రసాదించడంతోపాటు ఆపద నుంచి రక్షిస్తాడన్నారు. ఈ సందర్భంగా చర్చిలో ఆదివారం ఉదయం ఆరు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రార్థనలను నిర్వహించారు. మంగళగిరి, తాడేపల్లి, కేసీవర్క్స్, చిలువూరు, చినకాకాని, కాజ, నంబూరు, పెదవడ్లపూడి, నూతక్కి, ఆత్మకూరు గ్రామాలకు చెందిన ఆర్‌సీఎం చర్చి నిర్వాహకులైన పదిమంది విచారణ గురువులు తమతమ మందిరాల తాలూకా విశ్వాసులతో కలిసి కాలినడకన దివ్య సత్ప్రసాద ప్రభువుతో వడ్లపూడిలోని మిఖాయిల్ పుణ్యక్షేత్రానికి ప్రదర్శనగా తరలివచ్చారు.. మరో 21 మంది గురువులు, 64 మంది నన్స్ కూడ ఈ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి మొత్తం ఏడు వేలమంది భక్తులు హాజరుకాగా వారందరికీ పుణ్యక్షేత్రంలో భోజన సదుపాయాలను కల్పించారు. గుంటూరు మేత్రాసనంలో ఆగస్టు అయిదో తేదీన కూడ ఈ తరహా ప్రత్యేక ప్రార్థనా వేడుకలను నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాలలో ఫాదర్‌లు శౌరిబాబు, అంథోని, బాల, చిన్నప్ప, థామస్, సురేష్, జెరూమ్, ప్రవీణ్ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న గుంటూరు బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 516.60 అడుగులు ఉంది. ఇది 143.14 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 3031 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 4949 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 9790 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

కల్యాణం.. కమనీయం..

భద్రాద్రిలో వైభవంగా సీతారాముల పరిణయం



తలంబ్రాల వేడుక

భక్తి పారవశ్యంలో సినీ నటి కొణిదెల నిహారిక

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.



ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవదాయశాఖ మంత్రి కొండా సురేఖ

కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు

టీటీడీ తరఫున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు



కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు



రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

గుంటూరు సిటీ వార్తలు

• గుంటూరు తూర్పు • పశ్చిమ

జాబ్ మేళాకు నేటి నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ టెక్స్, జీఎంసీ ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించనున్న గుంటూరు మెగా జాబ్ మేళాకు సోమవారం నుంచి నగరంలోని వార్డు సచివాలయాల్లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ స్మార్ట్ టెక్స్, జీఎంసీ ఆధ్వర్యంలో నగరంలో 10వ తరగతి పైన చదివిన నిరుద్యోగ యువతకు వారి అర్హతకు తగిన విధంగా ఉండేలా సుమారు 50 కంపెనీల నుంచి ఉద్యోగాలు అందించేలా గుంటూరులో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నామన్నారు. ఐటీ, నాన్ ఐటీ, బ్యాంకింగ్, ఫార్మసీ, నర్సింగ్ రంగాల్లోని వివిధ కంపెనీలు నిర్వహించే ఉద్యోగాల కల్పనకు ఈ నెల 9న విజ్ఞాన మందిరంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వర్క్ షాప్ జరుగుతుందన్నారు. నగరంలో ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత తమకు అందుబాటులోని వార్డు సచివాలయంలో క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

సోమవారం ఉదయం 9:30 నుండి 10:30 గంటల వరకు నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్ (0863-2224202) కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అనంతరం గుంటూరు నగర పాలక సంస్థ 2025-26 వార్షిక బడ్జెట్ పై సమావేశం కౌన్సిల్ హాల్లో జరుగుతున్న సందర్భంగా ప్రతి సోమవారం నగరపాలక సంస్థలో నిర్వహించే 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జీఎంసీ ప్రధాన కార్యాలయంలోని జనన, మరణ నమోదు కార్యాలయం వద్ద (పార్కింగ్ వద్ద) నిర్వహిస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థుల్లో నైతిక విలువల్ని పెంచేదే నిజమైన విద్య

గుంటూరు(విద్య), ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ప్రాథమిక స్థాయి నుంచే నైతిక విలువల్ని పెంపొందించేదే నిజమైన విద్య అని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. స్థానిక రింగురోడ్డులోని శ్రీచైతన్య కో ఐపీఎల్ స్కూల్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులల్లో దేశభక్తిని పెంపొందించి వారిని సన్మార్గంలో పయనించేలా చేయాలని సూచించారు. చదువుతోపాటు క్రీడా, సాంస్కృతిక, కళారంగాల్లో ప్రోత్సాహం అందిస్తే విద్యార్థుల్లో పరిపూర్ణ వ్యక్తిత్వం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్, డీన్ శివకుమార్, ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



వేడుకల్లో పాల్గొన్న కమిషనర్ పులి శ్రీనివాసులు, చిత్రంలో ఏజీఎం దుర్గాప్రసాద్ తదితరులు

ప్రొఫెషనల్ ట్యాక్స్ చెల్లింపులు మరింత సులభతరం

● గుంటూరు -2 వాణిజ్య పన్నుల జాయింట్ కమిషనర్ గీతామాధురి

గుంటూరు ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెషనల్ ట్యాక్స్ చెల్లింపులు ప్రభుత్వం మరింత సులభతరం చేసిందని, ప్రొఫెషనల్ ట్యాక్స్ రిజిస్ట్రేషన్, ఫైలింగ్ కోసం కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ మాడ్యూల్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని వాణిజ్య పనుల శాఖ గుంటూరు-2 జాయింట్ కమిషనర్ గీతా మాధురి ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో ఏదైన వృత్తి, వ్యాపారం చేస్తున్న వారు చట్టంలో పేర్కొన్న రేట్ల ప్రకారం పన్ను చెల్లించాల్సి ఉంటుందని, ఏడాదికి పది లక్షల రూపాయలకు మించి టర్నోవర్ ఉన్న జీఎస్టీ నమోదిత చెల్లింపుదారులు వృత్తి పన్ను ఏడాదికి ఒకసారి చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒక సంస్థలో తమ ఉద్యోగులకు నెలకు రూ.15 వేలకు మించి జీతం చెల్లిస్తున్న ప్రతి యజమాని వారి ఉద్యోగుల తరఫున వృత్తి పన్నును ప్రతి నెలా చెల్లించాలన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

గుంటూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఆదివారం లాలుపురం మెయిన్ రోడ్డులో ఉన్న పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో జరిగిన బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు జూపూడి రంగరాజు మాట్లాడుతూ బీజేపీ కోసం దేశంలో ఎంతోమంది కార్యకర్తలు చేసిన త్యాగఫలితమే ఈ రోజు కేంద్రంలో వరుసగా మూడోసారి పార్టీ అధికారంలోకి రావడమన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల తరబడి ఈ దేశాన్ని వేధిస్తున్న కొన్ని బిల్లులను రద్దు చేసి గొప్ప బిల్లులను ప్రధాని మోదీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టంగా మారుస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకు లు మకుటం శివ, కొత్తూరు వెంకట సుబ్బారావు, పాలపాటి రవికుమార్, చరకా కుమార్‌గౌడ్, తోట రామకృష్ణ, వైవీ సుబ్బారావు, పాండురంగ విఠల్, అవుల నాగేంద్ర యాదవ్, డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, కృష్ణ చైతన్య, వెలగలేటి గంగాధర్, దారా అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి కార్యకర్తలే వెన్నెముక

● డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల పోరాటాల ఫలితమే వరుసగా మూడోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందని తూర్పు నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ అన్నారు. ఆదివారం నాలుగో మండలంలో జరిగిన బీజేపీ ఆవిర్భావ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యకర్తల కష్టం వృధా కానివ్వమని అన్నారు. పార్టీ సంస్థాగతంగా మరింతగా బలోపేతం చేయాలన్నారు. దేశ ప్రజలకు సుపరిపాలన అందించడానికి మోదీ కృషి చేస్తున్నారని అన్నారు. ఆయన అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమానికి మండల అధ్యక్షులు బోడాబత్తుల రామకృష్ణ అధ్యక్షత వహించగా, కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సువ్వా సురేష్, గురుదత్తు, సత్యనారాయణ, మహిళా మోర్చా తెంబెటి శివకుమారి, అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.




ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, పాల్గొన్న బీజేపీ నాయకులు

ఎయిడెడ్ మేనేజ్‌మెంట్ జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు

గుంటూరు(విద్య), ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఎయిడెడ్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఐక్యవేదికను ఏర్పాటు చేసినట్లు ఎయిడెడ్ మేనేజ్‌మెంట్స్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు అంజయ్య తెలిపారు. గుంటూరులోని యాదవ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాల అసోసియేషన్లు సమావేశం నిర్వహించాయి. ప్రభుత్వం నుంచి అందిస్తున్న సహాయ సహకారాల విషయంలో మరింత సమర్థవంతంగా పని చేసేందుకు ఎయిడెడ్ మేనేజ్‌మెంట్లు అన్నీ కలిసి ఏకం కావలసిన అవసరం ఉందని అంజయ్య అన్నారు. ఎయిడెడ్ విద్యా సంస్థల వలనే రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి విద్య అందుబాటులోకి వచ్చిన విషయాన్ని ప్రభుత్వాలు గుర్తించాలని ఆయన కోరారు. ఎయిడెడ్ పాఠశాలల విషయంలో ప్రభుత్వం కొంత సానుకూల దృక్పథాన్ని ఇంకా చూపించవలసిన అవసరం ఉందని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఎయిడెడ్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు ఐక్యవేదిక కృషి చేస్తుందని అంజయ్య వెల్లడించారు. ఈ సమావేశంలో ఎయిడెడ్ మేనేజ్‌మెంట్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడిగా అంజయ్య(గుంటూరు), ఉపాధ్యక్షుడిగా వెంకట సుబ్బానాయుడు(కడప), కార్యదర్శిగా శామ్యూల్ మోజెస్ (బాపట్ల), సహాయ కార్యదర్శిగా రామకృష్ణ చిట్టిబాబు (తూర్పుగోదావరి), అనిల్ కుమార్ రెడ్డి(బాపట్ల) ఎన్నికైనట్లు ఆయన తెలిపారు.



కొరిటెపాడు శ్రీ కోదండ రామాలయంలో మంగళసూత్రాన్ని చూపుతున్న అర్చకులు



సంపత్‌నగర్ రామనామక్షేత్రంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కమనీయం... సీతారాముల కల్యాణం

● రమణీయంగా శ్రీరామనవమి వేడుకలు
● భక్తులతో కిక్కిరిసిన శ్రీరామ, ఆంజనేయ స్వామి దేవాలయాలు



డీఎస్ నగర్ శ్రీ కోదండ రామస్వామి కల్యాణంలో పాల్గొన దంపతులు భక్తులు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): సీతా కల్యాణ వైభోగమే.. రామ కల్యాణ వైభోగమే.. సీతారామ కల్యాణ వైభోగమే అంటూ నగరంలో శ్రీరామనవమి వేడుకలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. చూసిన కనులదే భాగ్యం అన్నట్టుగా రాములోరి కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. ఊరూవాడ సీతారాముల కల్యాణోత్సవాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయాల్లో వేకువజాము నుంచే స్వామి మూలవిరాట్‌కు అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా కొబ్బరి మట్టలు, అరటి బోదెలు, మామిడి తోరణాలు అలంకరించిన వేదికపై వేద పండితుల ఆధ్వర్యంలో దంపతులతో సీతా రాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో ఆలయాలు కిక్కిరిసాయి. భక్తులకు అన్నప్రసాద వితరణ, వడపప్పు, పానకం అందజేశారు. పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు కల్యాణంలో పాల్గొని, స్వామి వారి ఆశీస్సులు పొందారు.



బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

● స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం పాలకమండలి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు మాధవాచారి, కృష్ణ, సతీష్, చిన్మయి బృందంచే శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. హారతి, అనంతరం విశేషంగా పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. బ్రహ్మశ్రీ నోరి నారాయణమూర్తి శ్రీరామ పట్టాభిషేకంపై ప్రవచనం చేశారు. కార్యక్రమాన్ని ఆలయ అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య పర్యవేక్షించారు.

● స్థానిక కొరిటెపాడు గాంధీ బొమ్మ సెంటర్ శ్రీ కోదండ రామాలయంలో ఉదయం స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం, సహస్రనామార్చన తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశేషంగా స్వామి వారు చందనాలంకారణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం సీతారాముల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ అధ్యక్షుడు కొమ్మినేని కోటేశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు.

● సంపత్‌నగర్ శ్రీ రామనామక్షేత్రంలో రాగం వెంకట లీలాసుందరి, మస్తాన్‌రావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు కల్యాణాన్ని విశేషంగా నిర్వహించారు. కల్యాణంలో దంపతులు పాల్గొని తలంబ్రాలను స్వీకరించారు. కల్యాణానంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కూచిపూడి ఆకట్టుకుంది.

● స్థానిక విద్యానగర్, శ్రీ సాయిసన్నిధానంలో శ్రీరామ కల్యాణాన్ని విశేషంగా నిర్వహించారు. కల్యాణంలో దంపతులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాన్ని ఆలయ గౌరవ అధ్యక్షుడు యడ్లపాటి అశోక్‌కుమార్, వడ్లమూడి శివరామకృష్ణయ్య, స్వరూపరాణీ తదితరులు పర్యవేక్షించారు.

● స్థానిక బ్రాడీపేట, శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో అర్చకులు విశ్వేశ్వరరావు శ్రీ రామ కల్యాణాన్ని విశేషంగా నిర్వహించారు. కల్యాణంలో దంపతులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాన్ని పవన్‌కుమార్ శర్మ, కళ్యాణ్‌లు పర్యవేక్షించారు.

● స్థానిక ఎస్‌వీఎన్ కాలనీ శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో దంపతులు భక్తి ప్రపత్తులతో పాల్గొన్నారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామి వారి కళ్యాణం తిలకించారు. అనంతరం దేవస్థాన పాలకమండలి వారు భక్తులకు వడపప్పు, పానకం వితరణ గావించారు.

● స్థానిక ఆర్ అగ్రహారం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం అత్యంత రమణీయంగా నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు సీతారాముల కల్యాణం తిలకించారు. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.

● స్థానిక మారుతి నగర్‌లోని శ్రీ కంచి కామకోటి పీఠ శ్రీ మారుతి దేవాలయ ప్రాంగణంలో శ్రీరామనవమి పర్వదిన సందర్భంగా శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం సామూహికంగా నిర్వహించారు. దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాన్ని కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

● స్థానిక లక్ష్మీపురం, శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో శ్రీ సీతా రాముల కల్యాణం విశేషంగా నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ గావించారు.

● స్థానిక కాకాని రోడ్డులోని సీతారామనగర్‌లో గల శ్రీ రామాలయంలో శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం అత్యంత రమణీయంగా నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు, మహిళలు సీతారాముల కల్యాణం తిలకించారు. నిర్వాహకులు భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు.



కొత్తపేట ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళ సూత్రాలను భక్తులకు చూపిస్తున్న అర్చకుడు

● గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా గుంటూరు కొత్తపేటలోని శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో శ్రీ సీతారాముల స్వామి వారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు వడపప్పు, పానకం, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భక్తులు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, దేవస్థానం ముఖ్య అర్చకులు ఏవీఎం నరసింహాచార్యులు, అర్చకులు మురళి, శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.





గుంటూరు నగరంలోని బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద ఆదివారం శ్రీరామ శోభాయాత్రను ప్రారంభిస్తున్న గజల్ శ్రీనివాస్, శివస్వామి, కమలానంద భారతీ స్వామిజీ, తులసి ధర్మచరణ్, వల్లూరి జయప్రకాష్ నారాయణ తదితరులు, కోలాటం ఆడుతున్న మహిళలు, భక్తులు - గుంటూరు తూర్పు (ఆంధ్రజ్యోతి)

వీధి కుక్కల స్వైరవిహారం



బాలుడి మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

గుంటూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ సింహాలు మృగ జీవాలులా మారుతున్నాయి. ముక్కుపచ్చలారని బాలలు కనిపించిందే తడవుగా వాటిల్లోని క్రూరత్వం నిద్రలేస్తున్నది. వెంటాడి వేటాడుతున్నాయి. ఇప్పటివరకు వాటి దాడిలో తీవ్రంగా గాయపడిన వారి ఉదంతాలే వెలుగులోకి రాగా శ్రీరామనవమి పండగ పర్వదినాన నాలుగేళ్ల బాలుడిని పొట్టన పెట్టుకొన్నాయి. ఇలాంటి దుర్ఘటనలు జరిగినప్పుడు పాలకులు వాటిని బంధించి వేరే ప్రాంతాలకు తరలిం చడం వంటి చర్యలు చేపడుతున్నారే తప్పా శాశ్వత పరిష్కారం కనుగొనడం లేదు. ఆదివారం గుంటూరు నగర శివారులోని స్వర్ణభారతీనగర్‌లో వీధికుక్కలు దాడి చేసి బాలుడిని పీక్కుతినడం ప్రతి ఒక్కరి గుండెలను పిండేస్తున్నది.

నాలుగు రోజుల క్రితం వట్టిచెరుకూరు మండలంలోని సౌపాడులో వీధికుక్కల మంద దాడి చేయడంతో ఏకంగా ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారికి తీవ్ర రక్తస్రావం అయ్యేలా అవి కరుస్తున్నాయంటే అవి శునకాలా లేక మృగాలా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ఇటీవలకాలంలో నగర పాలకసంస్థ వీధి కుక్కల విషయంలో పెద్దగా పట్టించుకోవడం లేదు. అడపాదడపాగా పట్టుకొని కు.ని శస్త్రచికిత్సలు చేసి వదిలేస్తున్నాయి. అయితే అవి వాటిపై ఏమాత్రం ప్రభావం చూపడం లేదు. నగరంలో ఏ వీధికి వెళ్లి చూసినా పదుల సంఖ్యలో ఇవి కనిపిస్తూనే ఉంటాయి. రాత్రి అయితే వాహనదారులపై విరుచుకుపడుతున్నాయి. ఆ క్రమంలో వాహనదారులు వేగంగా బైకులను నడుపుతూ అదుపు తప్పికిందపడిపోతున్న సంఘటనలు నిత్యకృత్యంగా మారాయి.

అత్యంత బాధాకరం : ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): గుంటూరు స్వర్ణభారతినగర్‌కు చెందిన నాలుగేళ్ల చిన్నారి వీధికుక్కల దాడిలో మరణించడం అత్యంత బాధాకరమని, తల్లిదండ్రుల శోకం తీర్చలేనిదని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి ఆమె ఒక ప్రకటన విడు దల చేశారు. కుక్కల బెడదపై అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పుడు అధికారులు తాత్కాలికంగా చర్యలు తీసుకోవడం, మర్చిపోవడం సర్వసాధారణమైందని, ఆ కారణంగా ఒక నిండు ప్రాణం బలైపోయిందని ఆవేదన చెందారు. ఇకనైనా అధికారులు వీధి కుక్కల మీద దృష్టి సారించాలని కోరారు.



జీజీహెచ్‌లో బాలుడు ఐజాక్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ స్మిత పద్మజ, కనపర్తి తదితరులు

కుటుంబాన్ని ఆదుకుంటాం : టీడీపీ నేతలు

గుంటూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : కుక్క దాడిలో మృతి చెందిన చిన్నారి ఐజాక్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని టీడీపీ కార్పొరేటర్‌లు, పార్టీ నాయకులు హామీ ఇచ్చారు. ఆదివారం రాత్రి టీడీపీ అధికార ప్రతినిధి కనపర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక కార్పొరేటర్ బొడ్డుపల్లి స్మిత పద్మజతో పాటు పార్టీ కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్, నూకవరపు బాలాజీ, కొమ్మినేని కోటేశ్వరరావు తదితరులు జీజీహెచ్‌కి వెళ్లి ఐజాక్ మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. మట్టి ఖర్చుల నిమిత్తం స్థానిక కార్పొరేటర్ స్మితా పద్మజ, పార్టీ నాయకుడు కనపర్తి శ్రీనివాసరావులు రూ. 20 వేలు కుటుంబ సభ్యులకు అందించారు. అనంతరం వారు జరిగిన విషయాన్ని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఫోన్ చేసి ఆయన దృష్టికి తీసుకెళ్లగా ఆయన నగర కమిషనర్‌కు ఫోన్ చేసి జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. బాలుడు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని పెమ్మసాని హామీ ఇచ్చారు. నగరంలో కుక్కల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిందిగా కమిషనర్ ను ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు బాలుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పట్టణాభివృద్ధి శాఖామంత్రి నారాయణ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్ తదితరులు మున్సిపల్ కమిషనర్ కు ఫోన్ చేసి ఘటన గురించి ఆరా తీశారు. అలాగే ఈ ఘటనపై ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించింది. సీఎంఓ నుంచి ప్రద్యుమ్న కమిషనర్ కు ఫోన్ చేసి సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు బాలుడు కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుందని ఆయన కమిషనర్ కు తెలిపారు.

సిబ్బంది, జంతు ప్రేమికుడికి మధ్య ఘర్షణ

● లాలాపేటస్టేషన్లో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు

ఏటుకూరు రోడ్‌లోని డంపింగ్ యార్డు వద్ద ఉన్న కుక్కల నియంత్రణ ఆపరేషన్ కేంద్రం వద్ద జంతు ప్రేమికుడికి, అందులో పని చేసే సిబ్బందికి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. అక్కడ కుక్కలకు ఆపరేషన్ చేసిన అనంతరం ఎక్కడి నుంచి తీసుకొచ్చిన కుక్కలను అక్కడే వదిలేయకుండా వాటిని వేర్వేరు ప్రదేశాల్లో వదిలేస్తున్నారంటూ జంతు ప్రేమికుడు జాదు సురేష్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది సూర్యనారాయణకు, సురేష్‌కు మధ్య జరిగిన ఘర్షణలో సూర్యనారాయణ కాలు విరగడంతో ఆయనను చికిత్స నిమిత్తం తరలించారు. దీనిపై ఇరువురు ఒకరిపై ఒకరు లాలాపేట స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు.

చికెన్ వ్యర్థాల తరలింపులో కొరవడిన శాస్త్రీయత

● టార్పాలిన్ పట్టా కప్పకుండా రవాణ ● ఎలాంటి చర్యలు తీసుకోని కార్పొరేషన్, పీసీబీలు

గుంటూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా చికెన్ వ్యర్థాల తరలింపులో రవాణదారులు ఎలాంటి శాస్త్రీయతని పాటించడం లేదు. చికెన్ స్టాల్స్ నుంచి కోళ్ల కోసిన తర్వాత వచ్చే బొచ్చు, పేగులు, కాళ్ల వంటి వ్యర్థాలను డ్రమ్ముల్లోకి నింపుకొని క్యారియర్ ఆటోలలో రవాణ చేస్తున్నారు. దాంతో ఆ వాహనం వెళ్లే మార్గం అంతా తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్నది. అంతేకాకుండా ఆయా వాహనాల నుంచి రక్తం రోడ్లపై పడుతూ పరిసరాలను కాలుష్య కారకంగా మారుస్తున్నది. వాహనాలకు కనీసం పట్టా కట్టడం వంటి చర్యలు కూడా రవాణదారులు తీసుకోకపోతుండటంపై జిల్లా ప్రజానీకం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. నగరపాలకసంస్థ, కాలుష్య నియంత్రణ మండలి కూడా ఈ విషయంలో ప్రేక్షకపాత్రకు పరిమితం అవుతున్నాయి. దీంతో ప్రజలు పీల్చే గాలిలో కాలుష్య శాతం మరింత పెరిగిపోతున్నది. ఇటీవల కాలంలో జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా గ్రామాల్లోనూ చికెన్ స్టాల్స్ సంఖ్య పెరిగిపోయింది. వీటి నుంచి నిత్యం వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఇక ఆదివారం వస్తే టన్నుల కొద్ది చికెన్ వ్యర్థాలు తయారౌతున్నాయి. నిబంధనల ప్రకారం వీటిని శాస్త్రీయంగా ఖననం చేయాలి. అయితే చేపల చెరువుల్లో మేతగా ఈ వ్యర్థాలను ఉపయోగిస్తున్నారు. ఇందుకోసం కొంతమంది కాంట్రాక్టర్లు కూడా పుట్టుకొచ్చారు. చేపల చెరువుల యజమానులతో ఒప్పందం చేసుకొని చికెన్ స్టాల్స్‌లో వ్యర్థపదార్థాలు సేకరించి సరఫరా చేస్తున్నారు. రవాణ సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదు. ప్రజల ఆరోగ్యం ఏమైతే మాకేంటి అన్న రీతిలో ఈ కాంట్రాక్టర్లు వ్యవహరిస్తున్నారు. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా రవాణ చేస్తున్నారు. చికెన్ వ్యర్థాలతో వాహనం వెళ్లిందంటే ఇక ఆ వీధి అంతా ఐదు నిమిషాలకు పైగా కుళ్లిన దుర్వాసనతో కూడుకొని ఉంటున్నది. పలుచోట్ల ఇళ్ల మధ్యనే చికెన్ స్టాల్స్ ఏర్పాటు చేయడంతో చుట్టుపక్కల ప్రజలు ఆ వాసన భరించలేకపోతున్నారు. వీటికి కార్పొరేషన్ అధికారులు ఎలా అనుమతిస్తున్నారో తెలియని పరిస్థితి. ఆస్పత్రులున్న ప్రదేశాల్లో అసలు చికెన్ స్టాల్స్ అనేవి ఏర్పాటు చేయకూడదు. నగరంలోని ఓల్డ్ క్లబ్ రోడ్డు, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఆస్పత్రుల వద్దనే చికెన్ స్టాల్స్ ఉన్నాయి. దీంతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. దుమ్ము, ధూళి, వాహనాల నుంచి వెలువడే పొగ వలనే మనం పీల్చే గాలి కలుషితం అవుతుండగా ఈ చికెన్ వ్యర్థాలతో మరింత కలుషితమైపోతున్నది. దీనిపై కార్పొరేషన్, పీసీబీ అధికారులు దృష్టి పెట్టి తగిన చర్యలు చేపట్టకపోతే ముందు ఇబ్బందికరమైన వాతావరణం తలెత్తే ప్రమాదం లేకపోలేదు.



టార్పాలిన్ పట్టాలు కట్టకుండానే తరలిస్తున్న చికెన్ వ్యర్థాలు

చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి బాట

● బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు

గుంటూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నదని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. ఆదివారం రాత్రి ఆయన గుంటూరు రైల్వే స్టేషన్‌కి వచ్చిన సందర్భంగా బీజేపీ జిల్లా నాయకులు శాలువా కప్పి గజమాలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్సీ వీర్రాజు మాట్లాడుతూ 2019 తర్వాత రాష్ట్రానికి రాజధాని లేకపోవడం మన దురదృష్టకరం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రైల్వే స్టేషన్‌లు, హైవేలు ఆధునీకరణ చేయడం సంతోషకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు చేయడానికి కేంద్రం సిద్ధంగా ఉంది. పారిశ్రామికవేత్తల్లో కూటమి ప్రభుత్వంపై నమ్మకం ఏర్పడి పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారని చెప్పారు. పోలవరంపై విజ్ఞత లేకుండా వైసీపీ నాయకులు ప్రవర్తించారు. గడిచిన వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఏపీలో తాను ఎప్పుడో లిక్కర్ స్కామ్ గురించి చెప్పానని గుర్తు చేశారు. వేరే పార్టీల నుంచి వచ్చే వారిని పార్టీలో చేర్చుకోవాలా.. వద్దా అన్న దానిపై హైకమాండ్ నిర్ణయిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు, వల్లూరు జయప్రకాష్ నారాయణ, యడ్లపాటీ స్వరూప రాణి తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లపై ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు : సీఐ

గుంటూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : రౌడీషీటర్లపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం పోలీస్ స్టేషన్లో ఆయన రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే రౌడీషీటర్లను ఉపేక్షించేది లేదన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రౌడీషీటర్లను అవసరమైతే నగర బహిష్కరణకు చర్యలు తీసుకుంటామని, పీడీ యాక్ట్‌కు వెనుకాడబోమని హెచ్చరించారు.

ఇంటర్మీడియెట్ తరవాత
ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌లు

ఇంటర్మీడియెట్ పరీక్షలు పూర్తయ్యాయి. విద్యార్థులు ఇక పూర్తిస్థాయిలో ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌లపై దృష్టిపెట్టి ఉంటారు. ఇప్పటికే జేఈఈ మెయిన్ రెండో సెషన్ కూడా దాదాపుగా పూర్తి కావచ్చింది. దీనితోపాటు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు రాసే ఇతర ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌లు ఇవి.

జేఈఈ మెయిన్ పేపర్-1

ఎన్ఐటీ, ఐఐఐటీ, సీఎఫ్‌టీఐ, ఇతర పేరున్న ఇంజనీరింగ్ కాలేజీల్లో బీఈ/బీటెక్ కోర్సుల్లో అడ్మిషన్లకు ఈ ఎంట్రెన్స్ రాయాలి.
వెబ్‌సైట్: jeemain.nta.nic.in

జేఈఈ అడ్వాన్స్‌డ్:

ఐఐటీల్లోని ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్, ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లో చేరడానికి దీనికి రాయాలి. అయితే జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించిన వారు మాత్రమే ఈ ఎంట్రెన్స్ రాయగలరు.
వెబ్‌సైట్: jeeadv.ac.in

బిట్స్ ఆప్టిట్యూడ్ టెస్ట్

పిలానీ, గోవా, హైదరాబాద్, దుబాయ్‌ల్లో ఉన్న బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బిట్స్) క్యాంపస్‌ల్లో ఇంజనీరింగ్ చేయడానికి ఈ సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ రాయాలి.
వెబ్‌సైట్: bitsadmission.com
చివరి తేదీ: 2025 ఏప్రిల్ 18

టీజీ ఎప్‌సెట్

తెలంగాణలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం టీఎస్ 'ఇంజనీరింగ్ అగ్రికలర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్' రాయాల్సి ఉంటుంది.
వెబ్‌సైట్: https://eapcet.tgche.ac.in/
చివరి తేదీ: 2025 ఏప్రిల్ 9(రూ.250/- ఆలస్య రుసుముతో) (ఐదువేల రూపాయల ఆలస్య రుసుముతో 2025 ఏప్రిల్ 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.)

ఏపీ ఎప్‌సెట్

ఆంధ్రప్రదేశ్‌లోని ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం 'ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్' రాయాల్సి ఉంటుంది.
వెబ్‌సైట్: https://cets.apsche.ap.gov.in
చివరి తేదీ: 2025 ఏప్రిల్ 24



విట్టీ

వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌ల అడ్మిషన్స్ కోసం 'విట్టీ' ఎంట్రెన్స్ (వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ 'ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ ఎగ్జామ్) రాయాల్సి ఉంటుంది. ఈ విట్‌కు పలు రాష్ట్రాల్లో క్యాంపస్‌లు ఉన్నాయి.
వెబ్‌సైట్: viteee.vit.ac.in
చివరి తేదీ: 2025 ఏప్రిల్ 7

ఎస్ఆర్ఎమ్ జేఈఈఈ

తమ సంస్థలో అడ్మిషన్ల కోసం ఎస్ఆర్ఎమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ జాతీయ స్థాయిలో ఎంట్రెన్స్ నిర్వహిస్తుంది. ఎస్ఆర్ఎంకు కూడా పలు రాష్ట్రాల్లో క్యాంపస్‌లు ఉన్నాయి.
వెబ్‌సైట్: srmist.edu.in
చివరి తేదీ: 2025 ఏప్రిల్ 16

సిట్టీ

వివిధ రాష్ట్రాల్లో 'సింబయాసిస్' సంస్థకు ఉన్న ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం ఈ ఎంట్రెన్స్ పరీక్ష రాయాలి.
వెబ్‌సైట్ : www.settest.org/register.html
చివరి తేదీ : 2025 ఏప్రిల్ 12

ఏపీ పీజీసెట్ 2025



ఆంధ్రప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలల్లో పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే 'పోస్ట్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2025'(ఏపీ పీజీసెట్ 2025)నోటిఫికేషన్ వెలువడింది. ఈ ఎంట్రెన్స్‌ను తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నిర్వహిస్తుంది.

ఈ నోటిఫికేషన్ ద్వారా రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ పీజీ కాలేజీల్లో 150కి పైగా పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఎంట్రెన్స్ కంప్యూటర్ ఆధారిత విధానంలో ఉంటుంది. యూనివర్సిటీలోని 85 శాతం సీట్లు స్థానికులకు కేటాయించారు.
ఈ ఎంట్రెన్స్ మూడు కేటగిరీలుగా ఉంటుంది.

కేటగిరీ-1: ఆర్ట్స్, హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్
కేటగిరీ-2: కామర్స్ అండ్ ఎడ్యుకేషన్
కేటగిరీ-3: సైన్స్ సబ్జెక్టులు

కోర్సులు: ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంసీజే, ఎంఎల్ఐఎస్సీ, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎంఎస్సీటెక్ తదితరాలు ఉన్నాయి.

అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. చివరి సంవత్సరం పరీక్షలు రాస్తున్న విద్యార్థులు కూడా ఎంట్రెన్స్‌కు హాజరు కావచ్చు.

పరీక్ష విధానం: లాంగ్వేజ్ స్పెషలైజేషన్ తప్ప మిగతా ప్రశ్నపత్రం ఇంగ్లీష్‌లో ఉంటుంది. కంప్యూటర్ ఆధారంగా పరీక్ష ఆబ్జెక్టివ్ పద్ధతిలో, ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. 90 నిమిషాల వ్యవధిలో 100 మార్కులకు జరుగుతుంది. నెగెటివ్ మార్కులు లేవు.

యూనివర్సిటీలు: ఆంధ్ర యూనివర్సిటీ (విశాఖపట్నం), డా.బీఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ(శ్రీకాకుళం), శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ(తిరుపతి), డా.అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ(కర్నూలు), శ్రీకృష్ణదేవ రాయ యూనివర్సిటీ(అనంతపురం), ద్రవిడియన్ యూనివర్సిటీ(కుప్పం), ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (గుంటూరు), కృష్ణా యూనివర్సిటీ(మచిలీపట్నం), శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం(తిరుపతి), ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ(రాజమహేంద్రవరం), యోగి వేమన యూనివర్సిటీ(కడప), క్లస్టర్ యూనివర్సిటీ(కర్నూలు), రాయలసీమ యూనివర్సిటీ(కర్నూలు), ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం యూనివర్సిటీ(ఒంగోలు), విక్రమ సింహపురి యూనివర్సిటీ(నెల్లూరు), జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(అనంతపురం), ఆయిల్ టెక్నలాజికల్ అండ్ ఫార్మాస్యూటికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(తిరుపతి)

చివరి తేదీ: 2025 మే 5 (ఆలస్య రుసుముతో 2025 మే 25 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.)

ప్రవేశ పరీక్షలు: 2025 జూన్ 6 నుంచి జూన్ 13 వరకు నిర్వహిస్తారు.

వెబ్‌సైట్:
https://cets.apsche.ap.gov.in

టెన్త్ తరవాత డిప్లొమా
లెదర్ టెక్నాలజీతో కెరీర్

- డిప్లొమా ఇన్ లెదర్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ
- డిప్లొమా ఇన్ లెదర్ గూడ్స్ అండ్ ఫుట్‌వేర్ టెక్నాలజీ

టెన్త్ తరవాత పాలిటెక్నిక్ డిప్లొమా చేయవచ్చని అందరికీ తెలిసిందే. అయితే మెకానికల్, సివిల్ వంటి రెగ్యులర్ కోర్సులతోపాటు పాలిటెక్నిక్‌లో ప్రత్యేకమైన కోర్సులు ఉన్నాయి. కొన్ని డిప్లొమాలు చేస్తే కాలేజీ పట్టాతోపాటే ఉద్యోగం వస్తుంది. అందులో లెదర్ టెక్నాలజీ ఒకటి. హైదరాబాద్‌లోని 'గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ'లో మాత్రమే సంబంధిత డిప్లొమా కోర్సులు ఉన్నాయి. దీన్ని 1980లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ కాలేజీ రెండు డిప్లొమాలను ఆఫర్ చేస్తోంది.

సీట్లు : ఒక్కో కోర్సులో 60 సీట్లు ఉన్నాయి. పదో తరగతి పాసైనవారు ఇందులో చేరేందుకు అర్హులు. గరిష్ఠ వయోపరిమితి లేదు. 'టీఎస్ పాలిసెట్'లో సాధించిన ర్యాంక్ ఆధారంగా సీటు లభిస్తుంది.

కోర్సు కాలవ్యవధి: ఆరు సెమిస్టర్లు/మూడేళ్ళు. మొదటి అయిదు సెమిస్టర్లూ కాలేజీలోనే థియరీ, ప్రాక్టికల్స్ ఉంటాయి. ఆరో సెమిస్టర్ అంటే చివరి ఆరునెలలూ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. పూర్తిగా ఇండస్ట్రియల్ ట్రైనింగ్ కోసం ఈ ఆరు నెలలు కేటాయించారు. ఈ సమయంలో విద్యార్థులు ఇండస్ట్రీ రెడీ విద్యార్థుల తయారవుతారు. ఇంటర్న్‌షిప్ సమయంలో ఉచిత వసతికి తోడు విద్యార్థులకు ఉన్న నైపుణ్యాలనుబట్టి నెలకు రూ.7,000 స్టయిపెండ్‌గా లభిస్తుంది.

ఉద్యోగ అవకాశాలు: దేశీయంగా బాటా వంటి కంపెనీలకు తోడు టాటా ఇంటర్నేషనల్ ఎక్స్‌పోర్ట్ డివిజన్, ఆడిడాస్, రీబాక్, నైక్, హిందుస్థాన్ లీవర్ లిమిటెడ్(ఎక్స్‌పోర్ట్ డివిజన్), ఫరీదా ఎక్స్‌పోర్ట్స్, ఫ్లోరెన్స్ ఎక్స్‌పోర్ట్స్‌లో ఈ డిప్లొమా హోల్డర్లకు జాబ్స్ లభిస్తున్నాయి.



ఉన్నత చదువులు

లెదర్ టెక్నాలజీలో డిప్లొమా తరువాత ఈసెట్ రాసి లేటరల్ ఎంట్రీ కింద బీఈ/ బీటెక్ రెండో ఏడాది కోర్సులో చేరవచ్చు. లెదర్ టెక్నాలజీ, మెకానికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, ఐటీ, సీఎస్ఈ చేయవచ్చు.

బీటెక్ అందించే కాలేజీలు

- హర్‌కోర్ట్ బట్లర్ టెక్నలాజికల్ యూనివర్సిటీ, కాన్పూర్
- దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్, ఆగ్రా
- అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ, అలీగఢ్
- ముజఫర్‌పూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ముజఫర్‌పూర్
- అలగప్పా కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ, చెన్నై
- సీఎస్ఆర్ సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, చెన్నై
- గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ లెదర్ టెక్నాలజీ, కోల్‌కతా


చిత్రజ్యోతి
SINCE 1965



నటనతో అదరగొట్టారు

ఎన్టీఆర్

"అంచనాలను మించి విజయం సాధించిన 'మ్యాడ్ స్క్వేర్' చిత్రబృందానికి నా అభినందనలు. ఈ విజయం వెనుక దర్శకుడు కల్యాణ్‌శంకర్ కష్టం చాలా ఉంది. ఈ సినిమాలో ప్రధాన పాత్రలు పోషించిన వారంతా తమదైన నటనతో అదరగొట్టారు. కామెడీని పలికించడం కష్టమైన పని. అందుకే నేను 'అదుర్స్ 2' చేయడం లేదు. అప్పట్లోలా ఇప్పుడు నవ్వించలేనేమో అనే భయం ఉంది. కానీ 'మ్యాడ్ స్క్వేర్'లో నార్నె నితిన్ కామెడీని బాగా పండించాడు" అని ఎన్టీఆర్ అన్నారు. ఇటీవలే విడుదలై ఘనవిజయం సాధించిన 'మ్యాడ్ స్క్వేర్' చిత్ర విజయోత్సవ వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు త్రివిక్రమ్ మాట్లాడుతూ "ఈ సినిమా ఇంతటి విజయం సాధించినందుకు ఆనందంగా ఉంది. చిత్రబృందానికి ధన్యవాదాలు" అని చెప్పారు. దర్శకుడు కల్యాణ్ శంకర్ మాట్లాడుతూ "నాగవంశీ లేకుంటే నేను ఉండేవాడ్ని కాదు. నిర్మాత చినబాబు లేకుంటే 'మ్యాడ్' చిత్రం ఉండేది కాదు" అని తెలిపారు.



మోగ్లీ సాహసం

'బబుల్‌గమ్' ఫేమ్ రోషన్ కనకాల నటిస్తున్న చిత్రం 'మోగ్లీ 2025'. సందీప్ రాజ్ దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. సాక్షిసాగర్ మడోల్కర్ హీరోయిన్. శ్రీరామనవమి సందర్భంగా ఈ చిత్రం నుంచి కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. అడవిలో హీరో హీరోయిన్లు ఓ చెట్టుకొమ్మకు వేలాడుతూ ఉన్న ఈ పోస్టర్ ఆసక్తిని పెంచేలా ఉంది. ఈ చిత్రానికి ఎడిటర్: కోదాటి పవన్ కల్యాణ్, డీఓపీ: రామమారుతి ఎం, సంగీతం: కాలభైరవ.

ప్రేక్షకుల ముందుకు చంద్రేశ్వర



క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన చిత్రం 'చంద్రేశ్వర'. సురేశ్ రవి, ఆశా వెంకటేశ్ జంటగా నటించారు. జీవీ పెరుమాళ్ వర్ధన్ దర్శకత్వంలో డాక్టర్ రవీంద్రాచారి నిర్మించారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఆధ్యాత్మిక అంశాలకు వినోదాన్ని జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని అంశాలూ ఈ చిత్రంలో ఉన్నాయి' అని తెలిపారు. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి, ఈ నెల్లోనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత చెప్పారు.

వైజయంతితో వారసుడు



నందమూరి కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా దర్శకుడు ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్లపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. విజయశాంతి శక్తిమంతమైన పోలీస్ పాత్రలో నటించారు. శ్రీకాంత్, సాయిమంజ్రేకర్, సోహైల్ ఖాన్ కీలక పాత్రలు పోషించారు. శ్రీరామనవమి సందర్భంగా ఈ చిత్రం నుంచి కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఇందులో విజయశాంతి ముందు కుర్చీలో కూర్చున్న కల్యాణ్‌రామ్.. విలన్ గ్యాంగ్ పనిపడుతూ కనిపించారు. ఈ చిత్రానికి ఎడిటర్: తమ్మిరాజు, డీఓపీ: రామ్‌ప్రసాద్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్.

'రామం'కు శ్రీకారం



శ్రీరామ నవమి సందర్భంగా చిత్రాలయం స్టూడియోస్ అధినేత వేణు దోనేపూడి 'రామం' అనే పాన్ ఇండియా సినిమాకు శ్రీకారం చుట్టారు. 'ది రైజ్ ఆఫ్ అకిరా' అనేది దీని ట్యాగ్‌లైన్. టాలీవుడ్ యంగ్ హీరో కథానాయకుడిగా నటిస్తున్నారు. పలువురు దర్శకుల దగ్గర పనిచేసిన లోకమాన్యని ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం చేస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్, మోషన్ పోస్టర్‌ను మేకర్స్ ఆదివారం విడుదల చేశారు. చిత్ర నిర్మాత వేణు దోనేపూడి మాట్లాడుతూ 'ఇప్పటి వరకు రానటువంటి వైవిధ్యమైన కథతో 'రామం' సినిమాను ప్రేక్షకుల ముందుకు తెస్తున్నాం. చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో తెలియజేస్తాం' అని చెప్పారు.

అనన్య హిందీ చిత్రం



సవాల్‌తో కూడిన పాత్రలను ఎంచుకుంటూ తనలోని నటిని కొత్తతరహాలో తెరపై ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు టాలీవుడ్ కథానాయిక అనన్య నాగళ్ల. 'మల్లేశం, వకీల్‌సాబ్' తదితర చిత్రాల్లో పాత్రోచిత నటనతో ఆమె ప్రేక్షకులకు చేరువయ్యారు. ఇప్పుడు బాలీవుడ్ అరంగేట్రానికి సిద్ధమయ్యారు అనన్య. మహిళా ప్రాధాన్య కథతో రూపొందుతోన్న హిందీ చిత్రంలో నటిస్తున్నారు. ఏక్తా ఫిలిం ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌లో రూపొందుతోన్న ఈ చిత్రానికి రాకేశ్ జగ్గి దర్శకత్వం వహిస్తున్నారు. హిమ్మత్ లడుమోర్ నిర్మిస్తున్నారు. 'ఇప్పటికే యాభై శాతం చిత్రీకరణ పూర్తయింది. వాణిజ్య అంశాలకి, సామాజిక అంశాలను కలిపి తెరకెక్కిస్తున్న చిత్రమిది. ఓ గిరిజన యువతి పాత్రలో అనన్య నాగళ్ల కనిపించనున్నారు. ఆమె అభినయం చిత్రానికి ప్రధానాకర్షణగా నిలుస్తుంది' అని మేకర్స్ తెలిపారు.

పుడ్తామా యేటి మళ్లీ

రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'పెద్ది'. శ్రీరామనవమి సందర్భంగా ఈ సినిమా నుంచి గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్ 'ఒకటే పని సేసేనాకి.. ఒకేనాగ బతికేనాకి.. ఇంత పెద్ద బతుకెందుకు.. ఏదైనా ఈ నేల మీద ఉన్నప్పుడే సేసేయాల.. పుడ్తామా యేటి మళ్లీ' అంటూ ఉత్తరాంధ్ర యాసలో రామ్‌చరణ్ పలికిన డైలాగులతో మొదలైన ఈ గ్లింప్స్ సినిమాపై అంచనాలను తారస్థాయికి తీసుకెళ్లింది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో రామ్‌చరణ్ క్రికెటర్‌గా కనిపించనున్నారు. ఆయన మాస్ లుక్, ఏఆర్ రెహ్మాన్ సంగీతం, రత్నవేలు విజువల్స్ ప్రధానాకర్షణగా నిలిచాయి. సినిమాను వచ్చే ఏడాది శ్రీరామనవమి సందర్భంగా మార్చి 27న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. అదే రోజు రామ్‌చరణ్ పుట్టినరోజు కూడా కావడం విశేషం. కాగా, ఈ సినిమాలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్నారు. జగపతిబాబు, కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. నిర్మాణ సంస్థలు మైత్రీమూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు.



చేయిపట్టి లాగారు




నటి శ్రీలీలకు చేదు అనుభవం ఎదురైంది. ముంబైలో షూటింగ్ పూర్తి చేసుకొని తిరిగి వస్తున్న సమయంలో కొందరు ఆకతాయిలు ఆమె చేయి పట్టుకొని బలం ఉపయోగించి తమ గుంపులోకి లాగారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కార్తిక్ ఆర్యన్ హీరోగా అనురాగ్ బసు దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రంలో ఆమె నటిస్తున్నారు. షూటింగ్ నిమిత్తం చిత్ర బృందం ఇటీవల డార్జిలింగ్ వెళ్లింది. చిత్రీకరణ అనంతరం కార్తిక్ ఆర్యన్‌తో కలసి శ్రీలీల తిరిగి వస్తుండగా వారిని చూసేందుకు స్థానికులు, అభిమానులు ఆసక్తి చూపించారు. ఈ క్రమంలో వారికి అభివాదం చేసుకుంటూ ఆమె ముందుకు నడిచారు. ఇంతలో బాడీగార్డులు, సెక్యూరిటీ సిబ్బంది ఉన్న గుంపులోంచి కొంత మంది ఆకతాయిలు ఆమె చేయి పట్టుకొని లాగారు. దీంతో శ్రీలీల షాక్‌కు గురయ్యారు. అప్రమత్తమైన సిబ్బంది ఆమెను అక్కడి నుంచి సురక్షితంగా తీసుకెళ్లారు.

సరికొత్త పాత్రలో విక్కీ కౌశల్



'ఛావా'లో శంభాజీ పాత్రలో నటించి మెప్పించిన విక్కీ కౌశల్ ఈసారి ఇంద్రజాలంతో ప్రేక్షకులను మైమరిపించేందుకు సిద్ధమవుతున్నారు. శూజిత్ సిర్కార్ దర్శకత్వంలో 'ఏక్ జాదూగర్' అనే హిందీ చిత్రంలో విక్కీ కౌశల్ మెజీషియన్‌గా నటిస్తున్నారు. రైజింగ్ సన్ ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తోంది. ఆదివారం ఈ సినిమా నుంచి చిత్రబృందం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేసింది. మెరుస్తున్న ఆకుపచ్చని దుస్తులతో ఇంద్రజాలికుని వేశంలో ఉన్న విక్కీ కౌశల్ లుక్ అదిరిపోయింది.

కదన రంగంలోకి



నటుడు అర్జున్ సర్జా కీలకపాత్ర పోషిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న చిత్రం 'సీతాపయనం'. శ్రీరామ్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ ఫిల్మ్స్ పతాకంపై రూపొందుతోంది. ఈ చిత్రంలో కీలకపాత్ర పోషిస్తున్న హీరో ధ్రువ సర్జా ఫస్ట్‌లుక్‌ను శ్రీరామనవమి సందర్భంగా చిత్రబృందం విడుదల చేసింది. తీక్షణమైన చూపులతో కదన రంగంలోకి దిగుతున్నట్టు ఆయన కనిపించారు. ఈ చిత్రంలో ఐశ్వర్యా అర్జున్ కథానాయిక. నిరంజన్, సత్యరాజ్, ప్రకాశ్‌రాజ్, కోవై సరళ కీలకపాత్రల్లో కనిపించనున్నారు. సంగీతం: అనూప్ రూబెన్స్, సినిమాటోగ్రఫీ: జి. బాలమురుగన్, ఎడిటర్: అయాబ్‌ఖాన్

ఓ రామ శ్రీరామ..



బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'జాట్'. సయామీ ఖేర్, రెజీనా కాసాండ్రా హీరోయిన్లు. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, జీ స్టూడియోస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. థియేటర్లలో ఈనెల 10న విడుదలవుతోంది. శ్రీరామ నవమి సందర్భంగా మేకర్స్ ఈ చిత్రం నుంచి 'ఓ రామా శ్రీరామ..' అనే పాటను విడుదల చేశారు. సంగీత దర్శకుడు థమన్ స్వరాలు అందించగా, ధనుంజయ్ ఆలపించారు.

నేడు తాడేపల్లి మండల వాసులకు శాశ్వత ఇళ్ల పట్టాల పంపిణీ

తాడేపల్లి(ఉండవల్లి), ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మన ఇల్లు - మన లోకేశ్ కార్యక్రమంలో భాగంగా తాడేపల్లి మండలం ఉండవల్లి, ఇప్పటం, కొలనుకొండ, పెనుమాక, గ్రామాలకు చెందిన 624 మంది లబ్ధిదారులకు మంత్రి లోకేశ్ డాన్ బాస్కో స్కూల్ వద్ద శాశ్వత ఇళ్లపట్టాలు సోమవారం అందజేయనున్నారు. కొలనుకొండకు చెందిన 231, పద్మశాలి బజారు 127, మధ్యాహ్నం పెనుమాక 179, ఉండవల్లి 77 ఇప్పటం 10మంది లబ్ధిదారులకు ఇంటిపట్టాలను అందజేయనున్నారు. ఈ కార్యక్రమం ఉదయం 9 నుండి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుందని టీడీపీ నేతలు తెలిపారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

● ప్రభుత్వపాఠశాలల బలోపేతానికి ఓ ఉపాధ్యాయుని ప్రచారం

దుగ్గిరాల, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లల్ని బడిలో చేర్పించాలంటూ గ్రామగ్రామాన, వీధివీధిలో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్రచారం కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్ని బలోపేతం చేయాలని తనవంతు ప్రయత్నంగా స్కూటీపై తిరుగుతూ, మైక్‌తో ప్రచారం చేస్తూ, ఆదివారం దుగ్గిరాల చేరుకున్నారు. చుండూరు మండలం వేటపాలెం జడ్పీహైస్కూల్‌లో పనిచేస్తున్న బట్టు వెంకయ్య తనవంతు బాధ్యతగా ప్రభుత్వపాఠశాలల్లో విద్యార్థులను చేర్చాలంటూ ప్రచారం చేస్తున్నారు.

చెట్టుకు నిప్పుపెట్టిన అగంతకులు

దుగ్గిరాల, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని బంగ్లా ఆవరణలో ఓ భారీచెట్టుకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. ఆదివారం దుగ్గిరాలలోని బంగ్లా ఆవరణలోని జూనియర్ కళాశాల ప్రాంగణంలో వున్న భారీచెట్టు నుంచి సాయంత్రం ఆరు గంటల సమయంలో మంటలు ఎగసిపడుతుండటం గమనించిన స్థానికులు పంచాయతీ సిబ్బందికి సమాచారం అందించారు. పంచాయతీసిబ్బంది మంటలనార్పివేశారు. కళాశాల ఆవరణలో కొంతకాలంగా గంజాయిబ్యాచ్ కదలికలు ఎక్కువగా ఉన్నాయని, మందుబాబులకు అడ్డాగా మారిందని వాకర్స్ చెబుతున్నారు.

ఐనవోలులో కర్రలతో దాడి

● ఒకరికి గాయాలు

తుళ్లూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐనవోల ఎస్సీ కాలనీలో డాక్టర్ అంబేద్కర్ జయంతి వేడుకలకు సంబంధించి శనివారం స్వల్ప వివాదం జరిగింది. ఆదివారం అంబేద్కర్ కమిటీ సభ్యులు కర్రలతో దాడి చేసుకున్నారు. ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసి, బాధితులను హాస్పటల్‌కు తరలించినట్టు తుళ్లూరు ఎస్సై బాబురావు తెలిపారు. ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మొత్తం 17మందిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

బిల్డింగ్ పైనుంచి పడి వ్యక్తి మృతి


సదాశివరావు మృతదేహం

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణ పరిధిలోని ఓ బహుళ అంతస్తుల భవనం మీద నుండి ప్రమాదవశాత్తూ పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదివారం జరిగింది. ఎస్ఐ ఖాజావలి తెలిపిన వివరాల ప్రకారం తుళ్లూరు మండలం వెంకటపాలెం గ్రామానికి చెందిన పాటిబండ్ల సదాశివరావు (54) కుటుంబంతో కలిసి తాడేపల్లి పట్టణ పరిధిలోని అపర్ణ అమరావతి అపార్ట్‌మెంటులో 8వ అంతస్తులో నివాసం వుంటున్నాడు. రోజులాగే బాల్కనీలో వాకింగ్ చేస్తుండగా, కళ్లు తిరిగి ప్రమాదవశాత్తూ పైనుండి కింద పడిపోయాడు. 108 సిబ్బంది వచ్చి సదాశివరావు మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతుడి భార్య మాధవి ఫిర్యాదు మేరకు తాడేపల్లి ఎస్ఐ ఖాజావలి కేసు నమోదు చేశారు.

ఫిరంగిపురంలో ఉచిత మజ్జిగ కేంద్రం ప్రారంభం

ఫిరంగిపురం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురంలోని సొలస బస్టాండ్ వద్ద గల రైతన్న మిల్క్ డెయిరీ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. సొలస బస్టాండ్ సెంటర్‌లో ఆటోలు, యాత్రికులు ఎక్కువగా వస్తుండటంతో ఎండలకు ఊరటనిచ్చేందుకు ఉచిత మజ్జిగకేంద్రాన్ని ప్రారంభించిట్టు రామిశెట్టి ప్రతాప్ తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, లయన్స్ క్లబ్ మండల ఉపాధ్యక్షుడు బడేటి సుబ్బారావు, రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం


తాడేపల్లి: సీతానగరం దేవాలయం వద్ద కల్యాణమూర్తులు


రాజీవ్ గృహకల్ప వద్ద సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు


తాడేపల్లి: కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భవాని తదితరులు


తాడేపల్లి: రాధారంగా నగర్‌లో కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న కాట్రగడ్డ మధు తదితరులు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి ఉత్సవాలను ఆదివారం వాడవాడలా ప్రజలు భక్తిప్రపత్తులతో జరుపుకున్నారు. రామనామ క్షేత్రాలతోపాటు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన చలువ పందిళ్లలో సీతారాముల కల్యాణ మహోత్సవాలను కన్నుల పండువగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పానకం, వడపప్పు తీర్థప్రసాదాలుగా పంపిణీ చేశారు. మంగళగిరి శ్రీ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం, ఏపీఎస్పీ ఆరవ పటాలం, పాతమంగళగిరి సీతారామస్వామి కోవెల, మెయిన్ బజారులోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీ లక్ష్మీ గణపతి కోదండ రామాలయం, భార్గవపేటలోని శ్రీ సీతారామ నామక్షేత్రం, గోలి లింగయ్య గారి రామమందిరం, రాజీవ్ గృహకల్ప, కుప్పురావుకాలనీ, లక్ష్మీనరసింహస్వామి కాలనీల్లోని రామాలయాల్లో సీతారామల కల్యాణం వైభవంగా జరిగింది. ఆంజనేయ కాలనీలో జరిగిన వేడుకల్లో సీతారామ భక్త సమాజం ప్రతినిధులు గుత్తికొండ ధనుంజయరావు, లక్ష్మయ్య, గద్దె శ్రీమన్నారాయణ, తిరువీధుల రాగూర్ శేషు, అలుగూరి రాజశేఖర్, తిరువీధుల అరుణ్‌బాబు, పడవల పెరుమాళ్లు, దివి మోహన్, రత్నారావు, దామర్ల మోహన్, గుత్తికొండ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పెదవడ్లపూడి గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరిగిన వేడుకల్లో మంగళగిరి మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీతానగరంలో...

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పండుగ సందర్భంగా తాడేపల్లి సీతానగరం శ్రీకోదండరామ సమేత శ్రీమద్వీరాంజనేయస్వామి ఆలయంలో సీతారాములు కల్యాణం నిర్వహించారు. దుర్గగుడి ఈవో, దేవదాయశాఖ అదనపు కమిషనర్ కె.రామచంద్ర మోహన్, స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. అలాగే బోటుయార్డు సమీపంలో ఉన్న ప్రభాత ఆంజనేయస్వామి దేవాయలంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నేషనల్ కన్సూమర్ రైట్స్ కమిషన్ చైర్‌పర్సన్ మంజుభవాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి అష్టోత్తరాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. 1000మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో పల్లి నాగేశ్వరరావు, లంకా వంశీ, సూరి, రఘు, తోట వంశీ, తదితరులు పాల్గొన్నారు. తాడేపల్లి కొత్తూరు సీతారామ లక్ష్మణ హనుమంత సమేత కోదండ రామాలయంలో కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయకమిటీ సభ్యులు దొంతిరెడ్డి సాంబిరెడ్డి, మేకా శ్రీధర్ రెడ్డి, మధుసూదనరెడ్డి, నాగిరెడ్డి, భాస్కరరెడ్డి, వేమారెడ్డి, బండి వెంకటరెడ్డి, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. భారీగా అన్నదానం నిర్వహించారు.

● తాడేపల్లి(వడ్డేశ్వరం), ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని రాధారంగా నగర్‌లో సిద్ధి వినాయక అభయాంజనేయస్వామి దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణమహోత్సవం ఘనంగా జరిగింది. అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు కాట్రగడ్డ మధు, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఈపూరి కోటయ్య, కాట్రగడ్డ లక్ష్మీ, యర్రంశెట్టి గణేష్, నాగూర్‌వలి, సురేష్, నాగరాజు, వెంకన్న, మస్తాన్‌వలి, షేక్ ఇమాంసా, కుమార్, దామోదర్, కాజ శ్రీనివాస్‌పాల్గొన్నారు.

వాడవాడలా శ్రీరామనవమి వేడుకలు

దుగ్గిరాల, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. రెండో భద్రాద్రిగా చెప్పుకునే దుగ్గిరాల మండలం వీర్లపాలెం గ్రామంలోని శ్రీసీతారాముల మందిరంలో స్వామివారి కల్యాణోత్సవ ం నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ శ్రీసీతారాముల వారి చిత్రపటాలను చేతపట్టుకుని వీధివీధి తిరుగుతూ మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దీపస్తంభమే రాములవారి ప్రతిమగా కొలుచుకునే స్వామివారి ఆలయానికి వచ్చి, ముఖమండపంలో కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం 5వేల మందికి అన్నప్రసాద వితరణ చేశారు. దుగ్గిరాల మండలంలోని పలు వైష్ణవాలయాల్లోనూ, శ్రీరామమందిరాలు, హనుమంతుని ఆలయాలవద్ద సీతారాముల కల్యాణోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.


ముట్లూరు గ్రామంలో సీతారామ కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులు

వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో ఆదివారం శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరుపుకున్నారు. సాయంత్రం స్వామివార్లకు ప్రత్యేక వాహనాల్లో గ్రామోత్సవాలు నిర్వహించారు. లేమల్లెపాడులో భారీగా అన్నదానం చేశారు.

నేత్ర పర్వంగా సీతారాముల కల్యాణం

కాకుమాను, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలోని రామాలయాలు, వైష్ణవాలయాలలో నవమి వేడుకలు నేత్ర పర్వంగా జరిగాయి. కాకుమానులో కోదండ రామాలయంలో సీత సమేత శ్రీరాముల వారి కల్యాణ వేడుకను నిర్వహించారు. బోడిపాలెం రామాలయం, కోతివానిపాలెం, తెలగాయపాలెం, రేటూరు, కొమ్మూరు తదితర గ్రామాలలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది.

● పెదనందిపాడు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. ఆదివారం కోదరండరామాలయాల్లో సీతారాముల కల్యాణం నిర్వహించారు, పెద్దఎత్తున అన్నదానం చేశారు.

ఘనంగా గంధోత్సవం

పెదనందిపాడు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా స్థానిక సాయిమందిర్‌లో ఆదివారం గంధోత్సవం ఘనంగా నిర్వహించారు. షేక్ ఇమామ్‌సాహెబ్ ఇంటి వద్ద నుండి గంధాన్ని ఫకీర్లు, డప్పు వాయిద్యాలతో ఊరేంపుగా తీసుకువచ్చి బాబా వారికి గంధంతో అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

● ప్రత్తిపాడు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రెండో భద్రాద్రిగా పేరొందిన యనమదల సీతారాముల కల్యాణ మహోత్సవం కన్నుల పండుగలా జరిగింది. స్వామి వారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు అనంతరం కళ్యాణం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. ప్రత్తిపాడు మండల పరిధిలోని అన్ని గ్రామాలలో సీతారాముల కళ్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

కారుమంచి దాతృత్వంపై అన్నదాతల్లో ఆనందోత్సాహాలు

కాకుమాను, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కాకుమాను మండలంలో బీడు భూములను సస్యశ్యామలం చేయడానికి రూ..10కోట్ల విరాళం ప్రకటించిన ప్రసాద్ సీడ్స్ అధినేత, ప్రముఖ పారిశ్రామిక వేత్త కారుమంచి ప్రసాద్‌బాబు దాతృత్వంపై అన్నదాతలలో ఆనందోత్సాహాలు వెల్లివిరిస్తున్నాయి. సీఎం చంద్రబాబునాయుడు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మార్గదర్శి, బంగారు కుటుంబం కార్యక్రమానికి ఆకర్షితుడైన ప్రసాద్ జన్మభూమి రుణం తీర్చుకునేందుకు ముందడుగు వేశారు. కాకుమాను మండలంలోని పలు గ్రామాలు కాలువ చివరి భూములుగా ఉండడంతో ప్రతి ఏటా రైతులు పంటల సాగుకు పడని పాట్లు లేవు. కాలువ చివరి గ్రామాలుగా ఉన్న కాకుమాను, కొమ్మూరు, కొండపాటూరు, అప్పాపురం తదితర గ్రామాలలో సుమారు 5 వేల ఎకరాల పైన ఆయకట్టుకు సాగు నీరు అందడం లేదు. సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే కార్యక్రమంలో భాగంగా పీ 4 పథకం ద్వారా కొమ్మమూరు లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మించాలని సీఎం చంద్రబాబును కోరటమే కాకుండా తన వంతు బాధ్యతగా రూ.10కోట్ల విరాళం చెక్కును ముఖ్యమంత్రికి ప్రసాద్ అందజేశారు.

వాడవాడలా నవమి వేడుకలు


తుళ్లూరులో సీతాదేవీ శ్రీరాముని కల్యాణం చేస్తున్న అర్చకులు

తుళ్లూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): సీతారాముల కల్యాణం కమనీయంగా రాజధానిగ్రామాలలో ఆదివారం జరిగింది. తుళ్లూరు కోదండరామస్వామి, సీతారామస్వామి, చెన్నకేశవ సీతారామస్వామి ఆలయాల్లో కల్యాణ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. పెదపరిమి, మందడం, వెంకటపాలెం, ఐనవోలు, వెలగపూడి, దొండపాడు, బోరుపాలెం, హరిశ్చంద్రపురం, వడ్డమాను తదితర గ్రామాలలో పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవానికి భక్తులు తండోపతండాలుగా ఆలయాలకు వచ్చారు.

● తాడికొండ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి సందర్భంగా మండల గ్రామాల్లోని రామాలయాల్లో ఆదివారం సీతారాముల కల్యాణోత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. తాడికొండలోని పడమర వీధి, ఉత్తర వీధి రామాలయాలు, గోపాలస్వామి దేవస్థానంలో కోదండరామచంద్రస్వామి కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. నిడుముక్కలలోని శ్రీపెయ్యలమిట్ట వీరాంజనేయస్వామి దేవస్థానంలో కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మండలలోని అన్ని గ్రామాల్లో రామాలయాల్లో సీతారాముల కల్యాణాలు నిర్వహించారు.

● ఫిరంగిపురం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురంలోని వైశ్యుల బజారులో శ్రీ రామాలయం వద్ద శ్రీసీతారాముల కల్యాణాన్ని ఆదివారం వైభవంగా జరిపారు. కొత్తపేటలోని నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కల్యాణం జరిపారు. భక్తులకు అన్నదానం చేశారు. రజక సంఘం ఆధ్వర్యంలో శ్రీరామాలయం వద్ద కల్యాణాన్ని ఘనంగా జరిపారు.

క్రైస్తవ విశ్వాసుల మహా పాదయాత్ర


పాదయాత్రలో పాల్గొన్న క్రైస్తవ విశ్వాసులు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): గురు మండల అధికారి ఎరువ బాల ఆధ్వర్యంలో క్రైస్తవ విశ్వాసులు ఆదివారం మహా పాదయాత్ర నిర్వహించారు. మంగళగిరిలోని డీనరీ ఫాదర్స్ జేఎంజే సిస్టర్స్ ఆధ్వర్యంలో దివ్య సప్రసాద పాదయాత్ర జరిగింది. ఉదయం ఆరు గంటలకు బేతపూడిలోని డివైన్ మెర్సీ చర్చి నుంచి ప్రారంభమైన పాదయాత్ర పార్కురోడ్డులోని ఆర్సీఎం నిర్మల మాత దేవాలయ విచారణ సంఘస్తులను పాతబస్టాండు వద్ద కలుపుకుని ఆత్మకూరు నిర్మల కాన్వెంట్ వద్దకు చేరుకుంది. అనంతరం పెదవడ్లపూడిలోని పునీత మిఖాయేల్ పుణ్యక్షేత్రం వరకు పాదయాత్ర సాగింది. దివ్య బలిపూజలో గుంటూరు జిల్లా పీఠాధిపతి డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య వాక్యోపదేశం చేశారు. పాదయాత్రలో థోమాస్ మండే, మంగళగిరిలోని అన్ని ఆర్సీఎం చర్చిల సంఘస్తులు, సిస్టర్లు, ఉపదేశకులు పాల్గొన్నారు.

ముగిసిన నూచాలమ్మ తిరుణాళ్ల

పెదనందిపాడు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నపర్రులో నూచాలమ్మ తిరుణాళ్ల మహోత్సవాలు మూడో రోజు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం గ్రామంలో అమ్మవారికి మహిళలు పెద్దఎత్తున పొంగళ్లు పొంగించి నైవేద్యాలు చెల్లించారు. సాయంత్రం సిడిమానును వీధుల్లో ఊరేగించారు. ఎస్ఐ మధుపవన్ బందోబస్తు నిర్వహించారు.

కొమ్మూరు హెల్త్ సెంటర్‌లో చోరీ

కాకుమాను, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మూరు విలేజ్ హెల్త్ క్లినిక్‌లో జరిగిన చోరీపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు ఎస్ఐ పృథ్వీ ఏకనాథ్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. కొమ్మూరు హెల్త్ క్లినిక్‌లో ఆదివారం ఉదయం హెల్త్ సెంటర్‌కు విధి నిర్వహణ కోసం వచ్చిన సిబ్బంది తాళం పగలకొట్టి కంప్యూటర్, ప్రింటర్, ట్యాబ్ చోరి చేసినట్లు గుర్తించారు. సీహెచ్‌వో మౌనిక ఫిర్యాదు మేరకే కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

రైతులకు చుక్కలు చూపిస్తున్న బ్యాంకర్లు

● బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వైవీ సుబ్బారావు

మేడికొండూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూములకు సంబంధించి పట్టాదారు పాసు పుస్తకాలు, లింకు డాక్యుమెంట్‌లు ఉంటేనే పంట రుణాలు ఇస్తామంటూ బ్యాంకర్లు రైతులకు చుక్కలు చూపిస్తున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వైవీ సుబ్బారావు ఆరోపించారు. మేడికొండూరు మండలం కొర్రపాడులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం పాస్‌బుక్ లేకుండానే వ్యవసాయ రుణాలు మంజూరు చేయాలని చెబుతోందన్నారు. బ్యాంకర్లు పట్టించుకోకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. కొన్ని సందర్భాల్లో బ్యాంకుల్లో పాస్ పుస్తకాలు, భూముల డాక్యుమెంట్లు పోగొట్టిన సందర్భాలు కోకొల్లలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నేరుగా బ్యాంక్ ఖాతాలోనే జమ చేస్తున్నందున ఆ మొత్తాన్ని కూడా రైతుల రుణాలకు లింకు పెట్టి తీసుకుంటున్నారని చెప్పారు. ఫలితంగా రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితి దాపురిస్తుందని తెలిపారు. ఇప్పటికైనా బ్యాంకర్లు వ్యాపార ధోరణి విడనాడి రైతుల ప్రయోజనాల కోసం పనిచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రపంచంలో ఐదో ఆర్థికశక్తిగా భారతదేశం

● బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కార్యవర్గసభ్యురాలు యడ్లపాటి స్వరూపరాణి


తాడేపల్లి: గుండిమెడలో వేడుకల్లో పాల్గొన్న జాన్‌బాబు తదితరులు


దుగ్గిరాలలో బీజేపీ పతాకావిష్కరణలో పాల్గొన్న రాష్ట్ర బీజేపీ కార్యదర్శి కార్యవర్గ సభ్యురాలు స్వరూపరాణి, గణేష్, జోగేంద్రప్రసాద్ తదితరులు

దుగ్గిరాల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే ఐదో ఆర్థికశక్తిగా ఎదిగిందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కార్యవర్గసభ్యురాలు యడ్లపాటి స్వరూపరాణి అన్నారు. దుగ్గిరాలలో బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. దుగ్గిరాల రైలుపేటలోని చెక్‌పోస్ట్‌వద్ద బీజేపీ పతాకావిష్కరణ, మండల పార్టీ కార్యాలయంలో కేక్‌కటింగ్ కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. చుండూరు ఉమామహేశ్వరరావు, కొంగర జోగేంద్రప్రసాద్, పసుపులేటి గణేష్, పంచుమర్తి ప్రసాద్, అడపా వెంకట్రావు, కొండపనేనే రవీంద్రరావు, అమ్మినేని సిద్ధయ్యానాయుడు, పాటిబండ్ల రాజారావు, సైమన్‌కిషోర్, రామ్మోహనరావు, నిడుమోలు సత్యనారాయణ పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంగళగిరిలో..

మంగళగిరి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణ బీజేపీ కార్యాలయంలోను, ఇందిరానగర్, మార్కెట్ సెంటర్, రత్నాలచెరువు, కుప్పురావు కాలనీ తదితర ప్రాంతాల్లో నేతలు బీజేపీ జెండాలను ఆవిష్కరించారు. పట్టణ అధ్యక్షుడు మునగాల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బీజేపీ పరిపాలన సాగుతుందని చెప్పారు. స్వచ్ఛ భారత్, వికసిత భారత్, మేక్ ఇన్ ఇండియా, మేడ్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటి వినూత్న ఆలోచనలతో యువతకు అనేక అవకాశాలను కల్పిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ చేనేత విభాగం కన్వీనర్ జగ్గారపు శ్రీనివాసరావు, నేతలు తుల్లిమిల్లి రామకృష్ణ, అందె శివశంకరరావు, తమ్మిశెట్టి వసంతకుమార్, కే.కృష్ణ, మొండి వీరబాబు, కొక్కిరాల యశోదకృష్ణ, వుద్దంటి రవికిరణ్, పటమట రాధాకృష్ణ, సురేష్, పీ.సోమశేఖర్, కొల్లి బాబూరావు, జంజనం కార్తికేయన్, అవ్వారు గిరిమోహనరావు, అద్దంకి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుండిమెడలో...

తాడేపల్లి(గుండిమెడ), ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం గుండిమెడ గ్రామంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం లక్ష్మణ్ మేకల జాన్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు మొక్కపాటి జనార్ధన్ పార్టీ జెండాను ఎగురవేసి కార్యకర్తలకు మిఠాయిలు పంచిపెట్టారు.కార్యక్రమంలో జిల్లా నేతలు వలివేలు సుబ్బారావు, నల్లిబోయిన చందు, పామర్తి వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం నాగేంద్రం, ఎం సాంబశివరావు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీఆవిర్భావ దినోత్సవం

మేడికొండూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆవిర్భావ దినోత్సవం మేడికొండూరు మండలంలోని పాలడుగు, ఎలవర్తిపాడు గ్రామాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు షేక్ బాషా ఆధ్వర్యంలో పార్టీ పతాకావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ తాడికొండ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య ముఖ్య అతిథిగా మా ట్లాడారు. కార్యక్రమంలో ఆమతి వెంకటరమణ, కొండెపోగు మహా లక్ష్మయ్య, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు డేరంగుల గోవిందరాజు, ట్రెజరర్ ఆమతి మణిదీప్, చల్లా రోసిరెడ్డి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు చేకూరి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు దూసరి శేషగిరి, కార్యదర్శి అశోక్, నాయకులు నరసింహ, అంజిబాబు పాల్గొన్నారు

● తుళ్లూరు(మందడం), ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని మందడం గ్రామంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్టిజన్ సెల్ స్టేట్ కో కన్వీనర్ కోళ్లపూడి హేమసుందర్, తాడికొండ నియోకవర్గ మాజీ కన్వీనర్ తొండెపు శివరామ గుప్తా, జిల్లా కార్యదర్శి మార్త నరేంద్ర, తుళ్లూరు మండల అధ్యక్షుడు నీరుకొండ లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు పరుచూరి రమణయ్య, సరిపూడి సాంబశివరావు, నాయకులు పాల్గొన్నారు.


మేడికొండూరు: పాలడుగులో పతాకావిష్కరణ చేస్తున్న బీజేపీ నాయకులు


తుళ్లూరు: మందడంలో బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



జ్యోతిరావు పూలే సినిమా పోస్టర్ ఆవిష్కరణ

తెనాలి అర్బన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తెనాలి కళాకారులు నటించిన జ్యోతిరావు పూలే సినిమా పోస్టర్‌ను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి మాట్లాడుతూ, సమాజ చైతన్యానికి పూలే ఎంతో కృషి చేశారని, ఆయన చరిత్రను నేటి తరానికి అందించే చిత్రాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. పట్టణంలోని 20మంది కళాకారులు ఈ చిత్రంలో నటించిన వారిని అభినందించారు. కార్యక్రమంలో ఈదర వెంకటపూర్ణచంద్, అయినాల మల్లేశ్వరరావు, బెల్లంకొండ వెంకట్, పెద్దేటి యోహాను పాల్గొన్నారు. ఈ నెల 10న పెమ్మసాని థియేటర్‌లో సినిమా ప్రదర్శిస్తారని తెలిపారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం...



దశావతార వెంకన్న సన్నిధిలో జరిగిన సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్లో సీతారాముల వారు)

తెనాలి అర్బన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీసీతారాముల కల్యాణం పట్టణంలో ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. హనుమాన్‌చౌక్, మార్కెట్ సెంటర్‌లోని దొంగరాముని ఆలయం వద్ద జరిగిన శ్రీసీతారాముల కల్యాణానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ఆద్యంతం కల్యాణ క్రతువు తిలకించారు. అలంకరించిన వేదికలపై స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉంచి అర్చకులు, దారా రవిశంకర్, శశికళ దంపతులు కల్యాణం జరిపించారు. వేద పండితులు కల్యాణ విశిష్టతను వివరిస్తూ కల్యాణం జరిపారు. హనుమాన్‌చౌక్‌లో ఉగాది నుంచి శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పెద్ద ఎత్తున చలువ పందిళ్లు వేసి నిత్యం శాంతి కల్యాణం చేశారు. రామాయణ ప్రవచనం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విశాఖపట్నం కళాకారులు నాదస్వర కచేరీ చేశారు. పలువురు భక్తులు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. మెట్ల పార్థసారథిశర్మ యాగ్నికులుగా కల్యాణం జరిపారు. కమిటీ కార్యదర్శి కేవీ సూర్యనారాయణమూర్తి, విద్యాధర్, రత్నాకరశాస్త్రి, ఆంజనేయశాస్త్రి, అర్చకులు నరసింహాచార్యులు పర్యవేక్షించారు. ఇక్కడ చిట్టి ఆంజనేయస్వామిని శ్రీసీతారామ మందిరంలో స్వామి వార్లను దర్శించుకునేందుకు భక్తులు సాయంత్రం నుంచి 10గంటల వరకు బారులు తీరారు. వచ్చిన భక్తులందరికీ కల్యాణ తలంబ్రాలు, ముత్యాలు పంపిణీ చేశారు. మార్కెట్ సెంటర్‌లో దొంగరాముని ఆలయంగా పిలుచుకునే శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయం ఎదుట అలంకరించిన వేదికపై రాముల వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. మార్చి 30 నుంచి స్వామి వారిని ప్రతిరోజు అవతారాలలో అలంకరించి పూజలు చేశారు. కోగంటి ఫణికిషోర్, గీత దంపతులు స్వామి వారి కల్యాణం చేయించారు. టీటీడీ విశ్రాంత సమన్వయకర్త మండలిక శ్రీకృష్ణకుమార్‌శర్మ కల్యాణ వ్యాఖ్యానం నిర్వహించారు. ఈవో అమర్‌నాథ్, ప్రధాన అర్చకులు జంధ్యాల గురునాథశాస్త్రి కల్యాణంను పర్యవేక్షించారు. స్వామివారిని సాయంత్రం హనుమత్ వాహనంపై ఘనంగా గ్రామోత్సవం జరిపారు. యోగాచార్యులు కిషోర్ గురూజీ ప్రవచనం చేశారు. జంధ్యాల శ్రీరామచంద్రమూర్తి శిష్య బృందం కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. పట్టణంలోని పట్టాభిరామస్వామి ఆలయంలో కృష్ణప్రసాద్, రమాదేవి దంపతులతో వేద పండితులు వేదాంతం నాగవెంకటమారుతి కల్యాణం చేయించారు. దుర్గాప్రసాద్, సంగమేశ్వరరావు, లక్ష్మీనారాయణ, శంకరరావు, ఈవో మల్లేశ్వరి తదితరులు కల్యాణంలో పాల్గొన్నారు. మారీసుపేట అప్పలస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామివారి విగ్రహాలను కల్యాణానికి మేళతాళాలతో తోడ్కొని వచ్చారు. ధర్మకర్త నారాయణస్వామి, శివానందకుమార్ పర్యవేక్షించారు. వెంకటేశ్వర్లు, సామ్రాజ్యం, రాంబాబు, అనురాధ దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ, శివాంజనేయప్రసాద్, అరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు మెయిన్‌రోడ్డులో పలుచోట్ల వేదికలు ఏర్పాటుచేసి సీతారాముల కల్యాణాన్ని వ్యాపారులు జరిపించారు. పట్టణంలోని పలు సీతారామ మందిరాలలో కల్యాణం కన్నుల పండువగా జరిగింది. కల్యాణ వేదికలను తిలకించేందుకు స్వామి వారి దర్శనానికి రాత్రి 7 నుంచి 11 గంటల వరకు తరలి వచ్చిన పట్టణ ప్రజలతో మెయిన్ రోడ్డు, బోసురోడ్డు తిరునాళ్లను తలపించింది.



తెనాలి హనుమాన్‌చౌక్‌లో వేదికపై కల్యాణమూర్తులు



తెనాలి పట్టాభి రామస్వామి ఆలయంలో జరిగిన కల్యాణంలో పాల్గొన్న భక్తులు

దశావతార సన్నిధిలో...

పెదకాకాని, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న దశావతార వెంకన్న స్వామి దివ్య క్షేత్రంలో శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణం వైభవంగా జరిపించారు. వేద మంత్రాలతో సంప్రదాయబద్ధంగా కల్యాణాన్ని కమనీయంగా జరిపించారు. ఆలయ ప్రాంగణంలో రాములవారు, సీతాదేవి ఉత్సవ విగ్రహాలను ఏర్పాటుచేసి కల్యాణం జరిపించారు. వేలాదిమంది భక్తుల ఆనందోత్సాహాల మధ్య సీతారాముల కల్యాణాన్ని ఇక్కడ రమణీయంగా జరిపించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పోటెత్తారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలతోపాటు హైదరాబాదు నుంచి పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు. కల్యాణం అనంతరం భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు. అనంతరం అన్న సంతర్పణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణభాస్కరరావు దంపతులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

కొల్లిపర, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): దుష్ట శిక్షణ, శిష్ట రక్షణకు, ఆదర్శ దాంపత్యానికి అనితర సాధ్యమైన కర్తవ్య నిర్వహణలో అన్నదమ్ముల అనుబంధానికి ప్రతీకగా నిలిచిన సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. మండలంలో వల్లభాపురం, మున్నంగి, పిడపర్తిపాలెం, గుదిబండివారిపాలెం, తూములూరు, దావులూరిపాలెం, హనుమాన్ పాలెం, బొమ్మువానిపాలెం, అన్నవరం గౌడపాలెం తదితర గ్రామాల్లోని రామాలయాల్లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన చలువ పందిళ్లల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాలను రంగ, రంగ వైభవంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని చూడటానికి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మండల కేంద్రం కొల్లిపర ఆరిమండ వారి రామాలయంలో రిటైర్ట్ తహసీల్దార్ ఆరిమండ కోటిరెడ్డి, రిటైర్ట్ ఎంఈవో ఆరిమండ కుటుంబరెడ్డి ఆధ్వర్యంలో శ్రీసీతారామ కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. షిర్డీ సాయిబాబా మందిరంలో, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్ధనస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జగన్నాథాచార్యులు, కుటుంబరావు, కుమారస్వామి, ప్రసాద్, పోగుల రామలింగేశ్వరశర్మ దంపతులతో పూజలు చేయించి భక్తులకు పానకం, వడపప్పు, ప్రసాదాలను పంపిణీ చేశారు. పలు రామాలయాల్లో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.

నవమి వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి రూరల్: శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మారీసుపేట అప్పలస్వామి వారి ఆలయంలో జరిగిన సీతారాముల కల్యాణమహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే శివకుమార్ పాల్గొన్నారు. నిర్వాహక కమిటీ సభ్యులు ఆయనను సాదరంగా ఆహ్వానించి తీర్థ ప్రసాదాలు అందించారు.

పొన్నూరు నియోజకవర్గంలో...

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా ఆదివారం పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాలు అంబరాన్ని అంటాయి. పొన్నూరు పట్టణంలోని తెలగపాలెం కోదండ రామాలయంలో నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు స్వామివారి మూలవిరాట్లతో పాటు ఉత్సవ మూర్తులకు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ కోదండ రామస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. పట్టణంలోని నేతాజీ నగర్ కోదండ రామాలయం, వీవర్స్ కాలనీలో రామమందిరం, తెలగపాలెంలోని చిన్న రామ మందిరం, వీరాంజనేయస్వామి ఆలంయలోని దశావతారాల ఆలయం, పాత పొన్నూరు ఆంజనేయస్వామి ఆలయం, నిడుబ్రోలు ఆంజనేయ స్వామి ఆలయం, పట్టణంలోని కసుకర్రు రోడ్డులో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నవమి వేడుకలు వైభవంగా జరిగాయి. మండల పరిధిలోని పచ్చల తాటిపర్రు శ్రీ రామాలయం, చింతలపూడి కోదండ రామాలయం, వల్లభరావుపాలెం రామమందిరం, వడ్డిముక్కల కోదండ రామాలయం, మన్నవ గ్రామంలోని చెన్నకేశవ స్వామి ఆలయం, చింతలపూడి అభయాంజనేయ స్వామి ఆలయం, కొండముది శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. మన్నవ చెన్నకేశవస్వామి ఆలయంలో జరిగిన నవమి వేడుకలలో ఎమ్మెల్యే నరేంద్రకుమార్ పాల్గొని ఉత్సవమూర్తులకు అభిషేకాలు నిర్వహించారు. చేబ్రోలు మండలంలోని చేబ్రోలు, శలపాడు, తోటపాలెం, తదితర రామాలయాలలో సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు కల్యాణ తలంబ్రాలను అక్షింతలుగా స్వీకరించి వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు.



కొల్లిపర శ్రీజనార్ధనస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న పండితులు



రామమందిరంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

వివాహిత అదృశ్యం



కోగంటి శారద (ఫైల్ ఫొటో)

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుల్తానాబాదుకు చెందిన కోగంటి శారద శనివారం వైకుంఠపురం గుడికని వెళ్లి సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాలేదు. భర్త రాంబాబు బంధువులను విచారించినా ఆమె ఆచూకీ తెలియరాలేదు. రాంబాబు ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

పేదలకు అన్నదానం

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం సభ్యులు నిర్వహించారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో ఆదివారం శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఎస్‌వీ యోగా సభ్యుడు మువ్వా పున్నయ్య, సుహాసిని కుటుంబ సభ్యుల సహకారంతో పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌వీ యోగా కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య, కుర్రా శ్రీనివాసరావు, మువ్వా వెంకట శివయ్య, మహాలక్ష్మి, కరిముల్లా, బాబు, విజయలక్ష్మి, అన్నదాత సుఖీభవ సభ్యులు పాల్గొన్నారు.

కూచిపూడి నర్తకి తేజస్వి ప్రఖ్యకు సత్కారం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తెనాలికి చెందిన కూచిపూడి నర్తకి ఆరాధ్యుల తేజస్వి ప్రఖ్య సత్కారం అందుకుంది. సింగరాయకొండ మండలంలోని బింగినపల్లిలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో మోహిని భస్మాసుర నృత్య రూపకం ప్రదర్శించిన ప్రఖ్య బృందాన్ని టూరిజం చైర్మన్ నూకసాని బాలాజీ యాదవ్ సత్కరించారు. బింగినపల్లిలో శనివారం మెడికల్ క్యాంపు, సాంస్కృతిక ఉత్సవం జరిపారు. కార్యక్రమంలో హైకోర్టు జడ్జి మన్మథరావు, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్‌బీ దామోదర్ పాల్గొన్నారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ

కొల్లిపర, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై మండల కేంద్రం కొల్లిపరలో పాస్టర్ మధిర ప్రభుదాసు ఆధ్వర్యంలో పాస్టర్లు, దళిత సంఘాల నాయకులు ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ దావులూరు అడ్డరోడ్డు నుంచి కొల్లిపర వరకు కొనసాగింది. ర్యాలీలో పాస్టర్స్ గోదా జయపాల్, జయబాబు, విప్పర్ల పాల్‌సుధీర్, దళిత సంఘాల నాయకులు బేతాళ భూషణం, పి.ఆనంద్, పి.గంగాధర్, కె.అమృతరాజు, వై.మృత్యుంజయరావు, ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మనోహర్ జన్మదిన వేడుకలు



వైకుంఠపురం ఆలయంలో కొబ్బరికాయలు కొడుతున్న జనసేన నాయకులు, వీరమహిళలు

తెనాలి రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జన్మదినాన్ని పురస్కరించుకుని గ్రోస్ ఫౌండేషన్, ఫార్చ్యూన్ రియల్టర్స్ వారి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన వచ్చింది. మండలంలోని కొలకలూరు జూబ్లీ స్కూల్‌లో కన్నెగంటి మురళీకృష్ణ, కైతేపల్లి షాలేమ్‌రాజు సుద్దపల్లి మురళీధర్ ఆధ్వర్యంలో మ్యాక్సీ విజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పటల్, న్యూక్లియర్ ఆప్టికల్స్ వారు కంటి సమస్యలతో వచ్చిన ప్రజలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. శుక్లాల శస్త్రచికిత్సలకు పలువురి పేర్లు నమోదు చేసి త్వరలోనే పూర్తి ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. నిర్వాహక సభ్యులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● మంత్రి నాదెండ్ల మనోహర్ జన్మదినం సందర్భంగా జనసేన నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం తెనాలి వైకుంఠపురం లక్ష్మీపద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయానికి జనసేన నాయకులు, వీరమహిళలు పెద్దసంఖ్యలో విచ్చేసి స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు జరిపి టెంకాయలు సమర్పించారు. పలువురు జన సైనికులు పాల్గొన్నారు.

● పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు మంత్రి మనోహర్ జన్మదిన కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వీరమహిళలు పేదలకు చీరలు పంపిణీ చేశారు. మంత్రి మనోహర్ పుట్టినరోజు పురస్కరించుకుని గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ మ్యాచ్‌లో విజేతలకు బహుమతులు అందించారు. పెద్దసంఖ్యలో జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.




క్రికెట్ మ్యాచ్‌లో విజేతలకు బహుమతులు అందిస్తున్న జనసేన నాయకులు

కొల్లిపరలో...

కొల్లిపర, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జన్మదిన వేడుకలను మండల పరిధిలోని అత్తోటలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కూటమి నాయకులు కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దాసరి నరసయ్య, రావిశెట్టి నరసింహ, యర్రు వెంకటేశ్వర్లు, బొద్దులూరు అశోక్, శనివారపు నాగరాజు, బొద్దులూరి కోటేశ్వరరావు, చందు మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడిపై దాడి

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఆటో ఎక్కిన దివ్యాంగుడిపై దాడిచేసి సొమ్ము, సెల్‌ఫోన్ దోచుకున్న సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని అంగలకుదురుకు చెందిన చుండి సుధాకరరావు దివ్యాంగుడు. రైల్ ప్రయాణం చేసేందుకు తెనాలి రైల్వేస్టేషన్‌కు శనివారం రాత్రి వచ్చాడు. ఆతను రాయితీ పాస్ ఇంటి వద్ద మరిచిపోయాడు. తాను ప్రయాణించే ట్రైన్ వచ్చే సమయం ఉండటంతో పాస్ తెచ్చుకునేందుకు తిరిగి స్వగ్రానికి ఆటో ఎక్కి వెళుతుండగా, డ్రైవర్ పక్కనే ఉన్న వ్యక్తి, మరొకరు కలసి ఆటోలోనే సుధాకరరావుపై దాడిచేసి జేబులో ఉన్న సెల్‌ఫోన్, కొంత నగదు తీసుకొని ఎరువుల కొట్ల బజార్‌వద్ద అతనిని ఆటో బయటకు నెట్టి పరారయ్యారు. బాధితుడు సుధాకరరావు ఆదివారం త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



బుర్రిపాలెం రోడ్డులో నేలవాలిన జొన్నపైర్లు

వర్షంతో నేల వాలిన జొన్నపైర్లు

తెనాలి రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షానికి మండలంలోని పలు ప్రాంతాల్లో కోత దశకు వచ్చిన జొన్నపైర్లు నేలవాలాయి. శనివారం మధ్యాహ్నాం తెనాలి ప్రాంతంలో కురిసిన వర్షానికి కంకులమీద ఉన్న జొన్నపైర్లు వర్షపు చినుకుల బరువుకు అక్కడక్కడ నేలవాలాయి. ఆదివారం ఎండ రావడంతో రైతులు పంట పొలాలకు వెళ్లి నేలవాలిన కంకులను పైకిలేపారు. గింజలు రంగుమారే ప్రమాదం ఉందని రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారులు తడిచిన జొన్నగింజలపై ఉప్పుద్రావణం పిచికారి చేయాలని సూచిస్తున్నారు.


యంగ్ జనరేషన్ టీం సేవలు అభినందనీయం: మాజీ ఎమ్మెల్యే

తెనాలి రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల కోసం ఆటో కొనుగోలు చేసి వారిని స్వల్ప ధరలకే గమ్యస్థానాలకు చేర్చేలా ముందుకు వచ్చిన యంగ్ జనరేషన్ టీం సేవలు అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో యంగ్‌జనరేషన్ టీం ఆధ్వర్యంలో నూతనంగా కొనుగోలు చేసిన ఆటోను శివకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ఆకలితో ఉన్న పేదల వద్దకే వెళ్లి ఆహారం పంపిణీ చేయడం, నిరుపేదలను ఆసుపత్రి తీసుకువెళ్లేందుకు టీం సభ్యులు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. టీం అధ్యక్షుడు సాదిక్, వైసీపీ నాయకులు కఠారి హరీష్, విజ్ఞాన్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సయ్యద్ ఇర్ఫాన్, సాదిక్, నవీన్, శివ, పలువురు టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణరంగ కార్మికులను ఆదుకోవాలి

● ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణరంగ కార్మిక, మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు డిమాండ్ చేశారు. పొన్నూరు పట్టణానికి చెందిన నిర్మాణ రంగ కార్మికుడు డక్కుమళ్ల రాంబాబు ఆదివారం మృతి చెందగా రాంబాబు మృతదేహానికి కార్మిక సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు . రాంబాబు కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆరేటి రామారావు మాట్లాడుతూ నిర్మాణ రంగ కార్మికులు మృతి చెందితే ప్రభుత్వం కార్మిక సంక్షేమ బోర్డు నుంచి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిర్మాణ రంగ కార్మిక, యూనియన్ నాయకులు గుమ్మడిరోశయ్య, హెబ్‌నైజర్‌బాబు, డక్కుమళ్ల మాణిక్యరావు, మాకాని పాండు రంగారావు, సుధాకర్, షేక్ బాజీ పాల్గొన్నారు.



భవన నిర్మాణరంగ కార్మికుడు రాంబాబు మృతదేహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ వంతెన సమీపంలోని బస్‌షెల్టర్ వద్ద శ్రీశివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవాసమితి సభ్యులు చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ది రెడ్‌క్రాస్ సొసైటీ తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి, డాక్టర్ పవని ప్రియాంకలు పాల్గొని చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా వేసవిలో భక్త బృంద సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను మజ్జిగ, మంచినీరు పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కుర్రా సుజాత, షేక్ మీరావలి, అవుతు రాజశేఖరరెడ్డి, షేక్ కాలేషా, జెట్టి శివరామకృష్ణ, పెసర్లంక రమణ, పాశం వెంకటేష్, జీవీ నారాయణ, ప్రతాప్, శ్రీనివాసరావు, యశ్వంత్ కుమార్, శ్రీమన్నారాయణ, తుల్లిమిల్లి చంటి, పోతురాజు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.



సాయి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

భక్తి శ్రద్ధలతో శోభాయాత్ర

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో సాయి నగర్ షిర్డీ సాయిబాబా మందిరం వద్ద నుంచి పట్టణంలో ఆదివారం సాయి శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా పల్లకి యాత్ర జరిగింది. కార్యక్రమంలో సాయి సేవా మండలి భక్తులతోపాటు ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ అధ్యక్షుడు షేక్ మగ్బుల్ బేగ్, టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, షేక్ బాజీ సాహెబ్, యాసిన్, తదితరులు పాల్గొన్నారు.



పతాకం ఎగురవేస్తున్న బీజేపీ నాయకులు

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆవిర్భావ దినోత్సవంను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కొత్తపేటలోని పోలీస్ క్వార్టర్స్, చినరావూరు రైల్వే స్టేషన్ కూడలిలో పార్టీ ప్రముఖ్ వినయ్‌కుమార్ బీజేపీ పతాకాలను ఆవిష్కరించారు. గాజుల వెంకయ్య నాయుడు, అడపా సంపత్‌రాయుడు, గోవాడ చైతన్య, లక్ష్మానాయక్, కళావతి, రత్నరాజు తదితరులు పాల్గొన్నారు. రూరల్ మండల గ్రామాల్లో కూడా బీజేపీ ఆవిర్భావ దినోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో కఠారి వాసుదేవ నాయుడు, కడియాల నందకిషోర్, కోటేశ్వరరావు, జనార్ధన్, బ్రహ్మయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● పొన్నూరు టౌన్: మండల పరిధిలోని కసుకర్రులో ఆదివారం భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. 1980లో జనసంఘ్‌గా ప్రారంభం అయిన పార్టీ బీజేపీగా ఆవిర్భవించిన సంఘటనలు మననం చేసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆరే వెంకట్రావు, పూల సుబ్రహ్మణ్యం, సాంబశివరావు, కఠారి ప్రసాద్, మధు సూధనరావు, శేషగిరి, అమరావతి సుబ్రహ్మణ్యం, దాసరి వెంకట నాగేశ్వరరావు, సీహెచ్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.